# జనసంద్రంగా మేడారం జాతర

### అమ్మవార్ల వనప్రవేశంతో దర్శనానికి పోటెత్తిన జనం



ములుగు,ఫిబ్రవరి24 : సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు శనివారం వన ప్రవేశం చేయనుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్దదె ల శుద్ధి పక్రియ మొదలై 5 నుంచి 6 గంటల మధ్య జరుగుతుంది.... ఈ కార్యక్రమం అయిపోగానే మేడారం మహాజాతర పూర్తయినట్లు గిరిజన పూజారులు అధికారికంగా ప్రకటిస్తారు. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు రాకతో మొదలైన మహాజాతర వన ప్రవేశంతో ముగుస్తుంది. సమ్మక్క, సారలమ్మను వనం నుంచి జనంలోకి తీసుకొచ్చిన పూజారులే తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ఇందుకోసం శనివారం మధ్యాహ్నం నుంచే గద్దెల దగ్గర పూజలు జరుగుతాయి. ఈ క్రమంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడురోజుల్లో కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయశాఖ అధికారులు ప్రకటించారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి గ్దదెలపైకి తీసుకొచ్చిన బుధవారం 20 లక్షల మంది దాకా, సమ్మక్కను తీసుకొచ్చిన గురువారం 30 లక్షల మందికిపైగా, శుక్రవారం 50 లక్ష మందికి పైగా మేడారం వచ్చారని వెల్లడించారు. గురువారం నుంచి మేడారం చుట్టూ రెడ్డిగూడెం, ఊరట్టం, నార్లాపూర్, కన్నెపల్లి ఏరియాలన్నీ పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు మేడారం గ్దదెలు నిమిషం కూడా ఖాళీలేకుండా భక్తులతో నిండిపోయి ఉన్నాయి. ఇలా మూడు రోజుల్లో కలిపి సుమారు కోటి మందికి పైగా మేడారానికి వచ్చారని అధికారులు ప్రకటించారు. మహాజాతరకు శనివారం చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## అభివృద్ధికి నోచని పటాన్ చెరు

### బిజెపి మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు



సంగారెడ్డి,ఫిబ్రవరి24 : పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం పఠాన్ చెరు ఏలాంటి అభివృద్ధి చెందలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘుందన్ రావు విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఈదుల నాగులపల్లిలో రైల్వే టెర్మినల్ భూసేకరణ వద్దే ఆగిపోవటం విచారకరమన్నారు. 153 కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యమైనా కొల్లూరు వద్ద కిలోమీటర్ సర్వీస్ రోడ్డును ఇవ్వలేకపోవటం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీద ఉన్న ప్రేమ సర్వీస్ రోడ్డు నిర్మాణం పై లేదని మండిపడ్డారు. పటాన్ చెరులో గొప్ప లాండ్ బ్యాంకు ఉన్నా ఐటి సెజ్ అభివృద్ధి చేయలేదన్నారు. లక్డారంలో క్రషర్ల రూపంలో గుట్టలను, కొండలను కరిగించేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకే ప్రజలు పట్టం కడతారని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## ఢిల్లీ శివారులోనే రైతుల మకాం

### వంటావార్పూ అక్కడే

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 : దేశ రాజధాని ఢిల్లీలో రైతుల ఆందోళన కొనసాగుతున్నది. తమ డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ, పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోనే వారు మకాం వేశారు. కావాల్సిన సరుకు సరంజామా అంతా వెంట తెచ్చుకుని బార్డర్‌లో తిష్టవేశారు. అక్కడే వండుకుతిని గుడారాల్లో తలదాచుకుంటున్నారు.తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, గత ఆందోళనల సందర్భంగా తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్లపై చర్చకు సిద్ధమంటూనే ప్రభుత్వం తాత్సారం చేస్తూ వస్తున్నది. గతంలోలా రైతులు రాజధానిలోకి చొచ్చుకురాకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా నడుమగల శంభు సరిహద్దులో రైతులు వాహనాలపైనే వంట చేసుకుంటున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

## త్వరగా యాదాద్రి పనుల పూర్తి

### అధికారులకు భట్టి ఆదేశాలు

నల్లగొండ,ఫిబ్రవరి24 : యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర మంత్రుల బృందం పవర్‌ప్లాంట్‌ను సందర్శించింది. బేగం పేట నుంచి హెలికాప్టర్లో విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు చేరుకున్నారు. వీరికి సీఎండీ రిజ్వీ, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తి స్వాగతం పలికారు. ముందుగా ఎ÷-లాంట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎండీ గెస్ట్ హౌస్‌లో ఉన్నతధికారులతో ప్రాజెక్టు పనులపై రివ్యూ చేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ఢిల్లీకి తెలంగాణ బిజెపి నేతలు

### సీట్ల కేటాయింపుపై పెద్దలతో చర్చ




హైదరాబాద్,ఫిబ్రవరి24 : ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు వెళ్లనున్నారు. సీట్ల కేటాయింపులపై చర్చించనున్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ , లక్ష్మణ్, డీకే అరుణ (ఆఖ ంసబీనిజీ), ఈటల సాయంత్రం బీజేపీ అగ్రనేతలతో సమావేశం కానున్నారు. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానంతో బీజేపీ నేతలు చర్చించనున్నారు. మార్చి రెండో వారంలో అభ్యర్థుల ప్రకటన చేయాలని బీజేపీ భావిస్తోంది. హైకమాండ్ వద్ద ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు పేర్లతో లిస్ట్ రెడీ చేయనున్నారు. సిట్టింగ్‌లు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయంకు మళ్ళీ అవకాశం లభించనుంది. మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంది. మల్కాజ్‌గిరి సీటును ఈటల, చాడా సురేష్ రెడ్డి, పన్నాల హరీష్ రెడ్డి, వీరేందర్ గౌడ్, కూన శ్రీశైలం గౌడ్ తదితరులు ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ స్థానంలో డీకే అరుణ, శాంతికుమార్, జితేందర్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం సీటును పీవీ రమేష్, గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్‌లు ఆశిస్తున్నారు. చేవెళ్ళ నుంచి కొండా విశ్వేశ్వరెడ్డి, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్ పోటీ దాదాపు ఖరారు అయ్యారు. బీఆర్ఎస్‌తో పొత్తుపై హైకమాండ్ నుంచి క్లారిటీ తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ నేతలు భావిస్తున్నారు.

## అదుపుతప్పిన టూ వీలర్ : ఒకరు మృతి

కుమ్రంభీం ఆసిఫాబాద్,ఫిబ్రవరి24 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన సిర్పూర్(టి) మండలం వెంపల్లి రైల్వే గేటు వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గుర్తించిన స్థానికులు క్షతగాత్రులను దవాఖానలో చేర్పించి పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ముగ్గురు స్నేహితులు ఒకే బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత

- వీఐపీల డ్రైవర్లకు ఫిట్ నెస్ పరీక్ష నిర్వహిస్తాం
- మంత్రి పొన్నం కీలక ప్రకటన



హైదరాబాద్,ఫిబ్రవరి24 : చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలిచిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఊహించని రీతిలో కారు ప్రమాదానికి గురై మరణించింది. ఈ ఘటన అందరినీ దిగ్భ్రాంతి గురి చేసింది. తన తండ్రి సాయన్న మరణించిన సంవత్సరానికి ఆమె కూడా ప్రాణాలు వదలటం మరింత కలిచివేసింది. అయితే ఈ ప్రమాదానికి కారణం. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపటం, అతివేగమేనని పోలీసులు నిర్ధారించారు. కాగా లాస్య నందిత ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఇది రెండు కారు ప్రమాదం. శుక్రవారం జరిగిన ప్రమాదానికి కారణం డ్రైవర్ ఆకాశే.. అయితే నల్గొండలో జరిగిన బీఆర్ఎస్ సభ నుంచి వస్తున్నప్పుడు ఆకాష్ కారు నడిపించాడు. అప్పుడూ ఓ వాహనాన్ని తప్పించబోయి.. యాక్సిడెంట్ చేశాడు. అయితే ఈ ప్రమాదానికి ఓ వ్యక్తి మరణించినట్లు సమాచారం . అయితే వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. లాస్య నందిత మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ క్రమంలోనే వీఐపీల దగ్గర ఉన్న డ్రైవర్లకు ఫిట్ నెస్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని ఆయన చెప్పుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు.. ప్రజాప్రతినిధుల దగ్గర ప్రస్తుతం ఉన్న డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి ఫిట్ నెట్ పరీక్షలు నిర్వహించినున్నట్లు ఆయన వెల్లడించారు.ఇదిలా ఉండగా మహాలక్ష్మి పథకం కింద కండక్లర్లు అనవసరంగా టికెట్లు కొడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో రెగ్యులర్ గా 44లక్షల ప్రయాణాలు జరిగితే.. ఇప్పుడు 55లక్షల మందికి పైగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి రూ. 12వేల హామీ ఇచ్చామని మంత్రి పొన్నం గుర్తు చేశారు. దాన్ని ఖచ్చింగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మరో వైపు కులగణనపై అధికారులకు శిక్షణ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిహార్ లో 2.5 లక్షల మంది అధికారులను కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్కరికి 150 ఇండ్లు అప్పజెప్పాలరని పేర్కొన్నారు. ఇక్కడ కూడా ఇళ్లను బట్టి.. అధికారులను నియమిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ గా బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంటు ఉంటుందన్నారు.

# మేడారంలో ప్రబలిన డయేరియా

### అప్రమత్తం అయిన వైద్యసిబ్బంది

### స్థానికంగానే వైద్యసేవలు అందచేత



ములుగు,ఫిబ్రవరి24 : మేడారం జనజాతరను తలపిస్తోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఈ క్రమంలో ఎండవేడిమికి కొందరు నీరసించారు. కొందరికి వాంతులు విరేచనాలు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తం అయ్యింది. కుంభమేళాను తలపించే రీతిలో లక్షలాది జనం పోటెత్తారు. చివారి రోజు కావడంతో మేడారం వెళ్లేదారులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇంతపెద్దఎత్తున జనం ఒకచోట గుమిగూడటంతో పాటు జంపన్న వాగులో సామూహిక స్నానాలు ఆచరిస్తుండంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.అలాగే జనం ఒత్తిడికి భక్తులు సొమ్మసిల్లిపడిపోతున్నారు. అలాంటి వారి కోసం మేడారంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. కుంభమేళాను తలపించే మేడారంలో భక్తులు సదుపాయాలు అందించడం ఎంతో కీలకం. అత్యవసర ప్రాథమిక చికిత్స సత్వరం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. మేడారంలోని టీటీడీ కల్యాణమండపంలో 50 పడకల ఆస్పత్రిని సిద్ధం చేసింది. అయితే జాతరకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది అశుభ్రమైన తినుబండారాలు, నీరు తాగి డయేరియాకు గురయ్యారని వైద్య బృందాలు వెల్లడించాయి. ఎక్కువ మంది విరోచనాలతో బాధపడ్డారని తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జాతరలో వివిధ ప్రాంతాల్లో 40 ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఎమ్ఙ్గ÷న్సీ సమయంలో భక్తుల వద్దకు వెళ్లేందుకు 40 మొబైల్ అంబులెన్సులు, ఇరవై 108 వాహనాలను జాతరలో నిరంతరం భక్తులకు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు గ్దదె ల సమీపంలో అన్ని విభాగాలకు చెందిన వైద్య సిబ్బందితో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరలో భక్తులకు నిరంతర సేవలందిచారు. భక్తులు సైతం నిరంతర ఉచిత వైద్య శిబిరాల వద్దకు వచ్చి సమస్యలను చెప్పుకొని మందులు తీసుకువెళ్ళారు. ఎండ వేడికి తోడు ఉక్కపోతతో మేడారంభక్తుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు తోసుకోవడంతో పాటు...గంటల కొద్దీ క్యూలైన్ లో నిల్చుని నీరసించిపోయారు. అలాగే సమయానికి తినకపోవడం, అపరిశుభ్రవాతావరణంలో తినడం వల్ల భక్తులు విరోచనాలతో బాధపడ్డారు. కొందరు భక్తులకు ఫిడ్స్ రాగా...మరికొందరు గుండెపోటుకు గురయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న భక్తులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. బీపీ, షుగర్ ఉన్న భక్తుల కోసం వైద్య సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర జరిగినన్ని రోజులు నిరంతర వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు, ఒక్కో షిఫ్ట్ లో 50మంది చొప్పున విధులు అందించారు. ఎమర్జెన్సీ వైద్యం అవసరమైన వారిని ములుగు ఏరియా ఆస్పత్రితోపాటు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చిన్నపాటి వైద్య సేవలను వైద్య శిబిరంలోనే అందించినట్లు వైద్యధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవుడి దయతో ఎలాంటి విపత్తులు సంభవించలేదని వారు వెల్లడించారు.

# ప్రమాదం ఎలా జరిగిందో అర్థం అవ్వట్లేదు

### ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది

### ఎమ్మెల్యే లాస్య నందిత పీఏ, డ్రైవర్ ఆకాష్



హైదరాబాద్,ఫిబ్రవరి24 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత యాక్సిడెంట్ కేసులో ఆమె పీఏ- డ్రైవర్ ఆకాష్ పై కేసు నమోదయ్యింది. ఆకాష్ నిర్లక్ష్యపూరితంగా కారు నడపడం వల్లే లాస్య చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆకాష్ నుంచి పటాన్ చెరు పోలీసులు స్టేట్ మెంట్ తీసుకున్నారు. మెజిస్ట్రేట్ ముందు స్పృహలో ఉన్న ఆకాశ్ వాగ్మూలం ఇచ్చాడు. దానిలో ఏముందుంటే.. " దర్గా నుంచి హైదరాబాద్ చేరుకుని.. లాస్య కారులో ఉన్న అక్క కూతుర్ని వేరే కారులోకి ఎక్కించాం. లాస్య తినడం కోసం వెళ్తామని చెప్పడంతో హొటల్స్ వెతుక్కుంటూ వెళ్లాం. ప్రమాదం ఎలా జరిగిందో అర్థం అవ్వట్లేదు. ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది." అని ఆకాష్ పేర్కొన్నారు. ఇక ప్రమాదం జరిగిన తీరును స్థానిక డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ముందు వెళ్తున్న వాహనం ఢీకొట్టిన తర్వాత ఎమ్మెల్యే కారు కంట్రోల్ కాక ఓఆర్ఆర్ పై లెఫ్ట్ సైడ్ రెయిలింగ్ కు ఢీ కొట్టిందన్నారు. ప్రమాదం కంటే ముందే కారు ముందు భాగం పగిలి కింద పడిపోయి ఉందన్నారు. నిర్లక్ష్యంగా అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. లాస్య నందిత సోదరి నివేదిక ఫిర్యాదుతో ఆకాష్ మీద ఐపీసీ సెక్షన్ 304 ఏ కింద పటాన్ చెరు పీఎస్ లో కేసు నమోదు అయ్యింది. శుక్రవారం ఉదయం 5గంటల 15 గంటలకు ఆకాష్ తమకు ఫోన్ చేశాడని తెలిపారు. ప్రమాదం జరిగిందని.. ఇద్దరికీ దెబ్బలు తగిలాయని లోకేషన్ షేర్ చేశాడని నివేదిత ఫిర్యాదులో పేర్కొన్నారు. తీరా స్పాట్ కు వెళ్లి చూస్తే కారు నజ్జు నుజ్జు అయి కారు మాత్రమే ఉందని ఆమె తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సదాశివపేటలో ఓ దర్గాలో మొక్కులు చెల్లించడానికి ఎమ్మెల్యే లాస్య నందిత తన కుటుంబ సభ్యులతో వెళ్లారు. అక్కడి నుంచి తిరిగొచ్చి కుటుంబ సభ్యులను ఇంటి దగ్గర దింపిన తర్వాత టిఫిన్ కోసం సంగారెడ్డి వైపు వెళ్లారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ప్రమాదంలో లాస్య చనిపోగా.. ఆకాష్ కాళ్లు విరిగాయి. షామీర్ పేట వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పైకి లాస్య కారు ఎంట్రీ అయినట్లు పోలీసులు గుర్తించారు. నిద్ర మత్తులోకి జారిపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ఆకాష్ చెప్తున్నప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## యూట్యూబర్ షణ్ముఖ్‌కు నోటీసులు జారీ



హైదరాబాద్,ఫిబ్రవరి24 : డ్రగ్స్ కేసులో యూట్యూబర్ షణ్ముఖ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్‌కు సంబంధించిన నివేదిక పదిరోజుల్లో రానుంది. నివేదిక ఫలితం ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. షణ్ముఖ్ యూట్యూబ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సూర్య వంటి వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు పొందాడు. బిగ్ బాస్ తెలుగు 5 రన్నరప్‌గా నిలిచారు. షణ్ముఖ్ జస్వంత్‌పై డ్రగ్స్ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని నార్సింగి పోలీసులు సీఆర్‌పీసీ 41 కింద నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్ రిపోర్టు పదిరోజుల్లో రానున్నాయి. రిపోర్టు ఫలితాల ఆధారంగా అవసరమైన చర్యలు తీసు కుంటామని అధికారులు తెలిపారు. గంజాయితో పట్టుబడిన షణ్ముఖ్ జస్వంత్ న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాడు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని సోదరుడు సంపత్ వినయ్‌ని పట్టుకునేందుకు పోలీసులు అతని ఇంటికి వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. సోదాల్లో షణ్ముఖ్ వద్ద 16 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని సోదరుడితో పాటు అతడిని అరెస్టు చేశారు.

## పాక్‌పై ఇరాన్ సైనిక దాడి

### రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం

బలూచిస్తాన్,ఫిబ్రవరి24 : ఇరాన్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాకిస్థాన్ భూభాగంలో ఇరాన్ మరోసారి సైనిక దాడిని నిర్వహించింది. ఇరాన్ సైనిక బలగాలు ప్రముఖ 'జైష్ అల్ అదిల్' మిలిటెంట్ గ్రూప్ కమాండర్ ఇస్మాయిల్ షాబక్ష్ పాకిస్తాన్ భూభాగంలో హత్య చేశారు. 2012లో ఏర్పాటైన 'జైష్ అల్ అదిల్'ని ఉగ్రవాద సంస్థగా ఇరాన్ గుర్తించింది. గత కొన్ని సంవత్సరాలుగా 'జైష్ అల్ అదిల్' ఇరాన్ భద్రతా దళాలపై అనేక దాడులు జరిపింది. డిసెంబరులో సిస్తాన్-బలూచిస్తాన్‌లోని ఒక పోలీసు స్టేషన్‌పై దాడి చేయగా. దాదాపు 11 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినందుకు జైష్ అల్-అద్ల్ బాధ్యత వహించాడు. ఉగ్రవాద సంస్థకు చెందిన రెండు ప్రధాన కార్యలయాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ పాకిస్థాన్‌లు పరస్పరం దాడులు జరిపాయి. పాకిస్తాన్, ఇరాన్‌ల భద్రతా సహకారాన్ని విస్తరించడానికి పరస్పరం అంగీకరించాయని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఈ ఒప్పందాన్ని పాక్ విదేశాంగ మంత్రి జలీల్ అబ్బాస్ జిలాండ్ అతని ఇరాన్ కౌంటర్ హొస్సేన్ అమీర్-అబ్దొల్లాహియాన్ పాక్ విదేశాంగ కార్యాలయంలో ప్రకటించారు. ఇరు దేశాలు తమ తమ ప్రాంతాల్లో ఉగ్రవాదంపై పోరుకు, పరస్పరం ఆందోళనలు తగ్గించుకునేందుకు అంగీకరించాయని ఆయన తెలిపారు. హమాస్-ఇజ్రాయెల్ ఘర్షణలతో ఇప్పటికే ఉద్రిక్త సమయంలో ఇరాన్-పాక్ ఘర్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# ధరణిపై కమిటీ వేయండి



హైదరాబాద్,ఫిబ్రవరి24 : ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మార్చి మొదటి వారంలోనే అన్ని మండల తహసీల్దార్ ఆఫీసుల్లో వీటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ధరణి కమిటీ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన విధి విధానాలను రూపొందించాలని రెవిన్యూ శాఖను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో 2.45 లక్షల పెండింగ్ కేసులున్నాయి. మొదటి విడతగా వీటిని వెంటనే పరిష్కరించేందుకు ఏమేం మార్గాలున్నాయని ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే వీటిని పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని, మార్చి మొదటి వారంలోనే అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. శనివారం సచివాలయంలో ధరణి కమిటీతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ బి.మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, సీసీఎల్ఏ అధికారి లచ్చిరెడ్డి, ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్నారు. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ ముఖ్యమంత్రికి నివేదించింది. అప్పుడు కేవలం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన భూ సమగ్ర సర్వేతోనే కొత్త చిక్కులు వచ్చాయని చెప్పారు. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని అన్నారు. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయని, కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించారు. దాదాపు 35 మాడ్యుల్స్ ద్వారా ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు రెవిన్యూ శాఖ అవకాశం ఇచ్చిందని, కానీ ఏ మాడ్యుల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని కమిటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని తెలిపారు. అటు రిజిస్ట్రేషన్ల శాఖ, ఇటు రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయని చర్చ జరిగింది. ధరణి డేటాను వ్యవసాయ శాఖ ప్రామాణికంగా తీసుకొని రైతు బంధు ఖాతాలో జమ చేయటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని చర్చ జరిగింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్ వో ఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పారు. సమస్యలను మరింత లోతుగా అధ్యయనం చేయాలని, ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా భూముల రికార్డుల ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరముందని సీఎం అన్నారు. భూముల రికార్డులపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు చెక్ పెట్టడంతో పాటు కొత్త సమస్యలు రాకుండా ఉండాలని సీఎం కమిటీ సభ్యులను అప్రమత్తం చేశారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అప్పటివరకు తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు.

## కాంగ్రెస్ గూటికి డిప్యూటీ మేయర్ శ్రీలత

### బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా

హైదరాబాద్,ఫిబ్రవరి24 : జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆ పార్టీకి.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ నాయకులు వరుసగా పార్టీని వీడటం గమనార్హం. ఫిబ్రవరి 13న తార్నాక డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసింది. గత కొంత కాలంగా బీఆర్ఎస్‌తో అసంతృప్తిగా ఉన్న డిప్యూటీ మేయర్ శ్రీలత రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలోకి చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేతలకు రాజీనామ సమర్పించినట్లు తెలుసుంది. శ్రీలతతో పాటు బీఆర్ఎస్ నాయకులు మరో ఆరు మంది కాంగ్రెస్‌లోకి చేరనునట్లు సమాచారం.లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపునుంచి బరిలో నిలిచేందుకు శ్రీలత సిద్ధమైనట్లు సమాచారం. అందులో భాగంగానే సికింద్రాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తున్నపట్టికీ.. దీనిపై ఎలాంటి స్పష్టత రాలేదు. భవిష్యత్తులో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. త్వరలో వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ చేరనున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి సతీమణి వికారాబాద్ జెడ్పీ ఛైర్మన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ క్రమంలోనే త్వరలో మరింత మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు క్యూ కట్టనున్నారు.

## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందం

### బిజెపి నేత లక్ష్మణ్ ఆరోపణ

హైదరాబాద్,ఫిబ్రవరి24 : తెలంగాణ సంపద దోచుకున్న బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... తెర వెనుక కుట్రలు, కుమ్మక్కు రాజకీయాలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అలవాటు అయ్యాయని ఆరోపించారు. బీజేపీ చెప్పిందే చేస్తుందని.. ఏ విషయనైనా బహిరంగంగా చెబుతుందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణిపై సీబీఐతో విచారణ చేయిస్తామని రేవంత్ చెప్పారని.. ఇప్పుడెందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ ఎప్పటికీ పొత్తు ఉండదని... పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. గెలిచే గుర్రాలను 17 ఎంపీ స్థానాల్లో నిలపెట్టబోతున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిష్మాతో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీ దృష్టి ఎప్పుడూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంపైనే ఉండేది. దేశ భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకులకు పట్టింపు లేదు. కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికీ కాంగ్రెస్ దశ, దిశ మారలేదు. బంధుప్రీతి, అవినీతి, అలకలు, బుజ్జగింపులు ఇవి తప్పా వేరే విషయంపై ఆలోచించదు. కాంగ్రెస్ నేతలు వారి కుమారులు, కుమార్తెల రాజకీయ భవిష్యత్తును రూపొందించడంలో బిజీగా ఉన్నారు. పేద ప్రజల కుమారులు, కుమార్తెల గురించి వారు ఎప్పుడూ ఆలోచించరు. దేశ ప్రజలంతా మోదీ కుటుంబ సభ్యులు.అందుకే దేశ అభివృద్ధి గురించే నేను, మా పార్టీ నేతలు మాట్లాడుతుంటారు. పేదలు, యువత,మహిళాసాధికారతతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చు. ఛత్తీస్‌గఢ్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పథకాన్ని నిలిపేసింది. మా ప్రభుత్వం ఆ పనుల్ని వేగవంతం చేసింది'అని మోదీ అన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్, మంత్రులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే దాడులా

(మొదటిపేజీ తరువాయి)

ప్రతీకారంతో జరుగుతున్న పాలన లాగా కనిపిస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రమేయం లేకుండా తెలంగాణ వచ్చిందనే ప్రతీకారం ఉన్నట్టు ఉంది. అనేక మందిపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి దాడులు గమనించాలి. ప్రజలకు సుపరిపాలన అందించే ఉద్దేశ్యం లేదు. ఇలాంటి దాడులను ఖండిస్తున్నాం'అని క్రాంతి మండిపడ్డారు.

## బీజేపీ సొంతగా 370 సీట్లు సాధించలేదు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యం మాత్రమే అని అన్నారు. అయితే, ఇది బీజేపీకి ప్రతిష్టాత్మక లక్ష్యమని చెప్పారు. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలువలేదని అన్నారు.కాగా.. బీజేపీ 370 సీట్ల గెలుపుపై అమిత్ షా ఇటీవల వారి వ్యూహాన్ని ప్రకటించారు. ఆర్టికల్ 370ని తొలగించామని అందుకే తాము 370 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన ఆర్టికల్ 370ని 2019లో కేంద్రం తొలగించింది. భారత రాజ్యాంగం, చట్టాలు నేరుగా ఆ ప్రాంతానికి వర్తించేలా బీజేపీ మార్గం సుగమం చేసింది.

## టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారితో సహా మొత్తం 563 ఖాళీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులకు అభ్యర్థులందరూ అప్లికేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. పరీక్ష ఫీజు కాకుండా రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ దరఖాస్తుదారులందరికీ పరీక్ష ఫీజు మినహాయింపు ఉంటుంది. 26 ఏప్రిల్ 2022 తేదీ నోటిఫికేషన్ నంబర్ 04/2022 కోసం గతంలో దరఖాస్తు చేసిన, ఫీజు చెల్లించిన అభ్యర్థులు ఈ నోటిఫికేషన్ కోసం మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు.టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష 2024 ఎంపిక ప్రక్రియలో మూడు రౌండ్‌లు ఉంటుంది. ఇందులో ప్రీ, మెయిన్స్, డాక్యుమెంట్‌ల వెరిఫికేషన్ రౌండ్స్ ఉంటాయి. టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఒక పేపర్ ఉంటుంది, దీనిలో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కు తొలగిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష 2.5 గంటలు, ప్రధాన పరీక్ష పేపర్ 3 గంటల పాటు ఉంటుంది.

## ఢిల్లీ, గుజరాత్‌లలో ఆప్ కాంగ్రెస్ ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

సైతం కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో సీట్ల పంపకాన్ని ఫైనల్ చేసింది. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ, ఆప్ పొత్తులో భాగంగా పోటీ చేయనున్నాయ. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు రెండు సీట్లను ఆఫర్ చేసింది. ఈ మేరకు ఇరు పార్టీలు అధికారికంగా ప్రకటించాయి. అయితే కాంగ్రెస్, ఆప్ పొత్తుపై పలువురు నేతలు స్పందిస్తున్నారు. తాజాగా అహ్మద్ పటేల్ కూతురు ముంతాజ్ పటేల్ ఎక్స్ ' ట్విటర్' వేదికగా స్పందించారు. 'భారుచా జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ కేడర్‌కు క్షమాపణలు తెలుపుతున్నా. కాంగ్రెస్, ఆప్ పొత్తులో భాగంగా భారుచా లోక్‌సభ స్థానం పొందలేకపోయాం. మీ నిరాశను నేను పంచుకుంటాను. మనమంతా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. 45 ఏళ్ల అహ్మద్ పటేల్ వారసత్వాన్ని వృథా కానివ్వం' అని ఆమె తెలిపారు. గుజరాత్‌లో పొత్తులో భాగంగా భారుచా లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు కేటాయించింది. ఈ క్రమంలో మంతాజ్ ఖాన్ ఆ స్థానంపై ఆశపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంనే ఆమె తన జిల్లా కేడర్‌కు క్షమాపణలు చెప్పినట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు.. అహ్మద్ పటేల్ కుమారుడు ఫైసల్ కూడా స్పందించారు. 'నేను మరోసారి కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసి మాట్లాడుతా. నామినేషన్ వేయడానికి ఇంకా చాలా సమయం ఉంది. గాంధీ కుటుంబం నా కుటుంబంతో సమానం. భారుచా లోక్‌సభ స్థానానికి సంబంధించి.. అహ్మద్ పటేల్ కుటుంబానికి ఉన్న సెంటిమెంట్‌ను అధిష్టానం అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నా'అని తెలిపారు. 'పార్టీ నిర్ణయంపై కార్యకర్తలు, నేను సంతోషంగా లేము. ఈ నిర్ణయం తీసుకోకూడదని మేము కోరుకున్నాము. కానీ.. కాంగ్రెస్ హైకమాండ్ తీసుకుంది. కావున మేము దాన్ని అనుసరిస్తాం. పార్టీ నిర్ణయాన్ని నేను, కార్యకర్తలం అనుసరిస్తాం?' అని పేర్కొన్నారు.

## ఇక రైళ్లలో స్విగ్గీ ఫుడ్ డెలివరీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 : దేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ అంటే అతి భారతీయ రైల్వే అని చెప్పక తప్పదు. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తున్నారు. దీని కోసం రైల్వే శాఖ కూడా అన్ని రకాల సదుపాయాలను అందిస్తోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సదుపాయాలను మెరుగు పరుస్తోంది. అయితే రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు నాణ్యమైన ఫుడ్ అందించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. ఐఆర్‌సిటిసి పోర్టల్ ద్వారా రైలు ప్రయాణికులకు ముందస్తుగా బుక్ చేసుకున్న ఆహారాన్ని డెలివరీ చేసేందుకు స్విగ్గితో ఐఆర్‌సిటిసి ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతానికి, బెంగళూరుతో సహా కొన్ని ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో ఇది అమలు చేయబడుతుంది. ఈ సర్వీసు ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియదు. ప్రీ-ఆర్డర్ చేసిన ఆహారాన్ని (ముందస్తు-ఆర్డర్ చేసిన భోజనం) డెలివరీ కోసం తో చేతులు కలిపినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి తన ఫైలింగ్‌లో సమాచారం ఇచ్చింది. ఐఆర్‌సీటీసీ ఇ-క్యాటరింగ్ పోర్టల్ ద్వారా ప్రీ-బుక్ చేసిన ఆహారాన్ని సరఫరా చేయడానికి, డెలివరీ చేయడానికి బండిల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (స్విగ్గీ ఫుడ్స్)తో ఐఆర్‌సీటీసీ ఒప్పందం చేసుకుంది. తొలి దశలో నాలుగు రైల్వే స్టేషన్లలో ఈ సర్వీసును ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది.

# వచ్చే పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ తిరుగులేని శక్తిగా భారత్

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఆశాభావం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 : ఆర్థిక మాంద్యం సమయంలో సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలోని ఏకైక దేశం భారతదేశం అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పునర్ఘాటించారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, శ్రీలంక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. బ్రిటన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలదీ అదే పరిస్థితి. అక్కడ కూడా వృద్ధి రేటు నత్త నడకన సాగుతోంది. వచ్చే పదేళ్లలో భారత్ ఆరు నుంచి ఎనిమిది శాతం వృద్ధి రేటుతో అభివృద్ధి చెందిన దేశంగా అవరించబోతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. వచ్చే 10 ఏళ్లలో భారత్ సాక్ష్యమివ్వనున్న అద్భుతమైన వృద్ధికి అనుగుణంగా వ్యాపార, వ్యూహాత్మక ప్రణాళికలను రూపొందించుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్. ముంబయిలో జరిగిన '%జ్% ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2023' కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ, రైసినా డైలాగ్ 2024లో భారతదేశంలో వ్యాపారం చేయవలసిందిగా గ్లోబల్ కంపెనీలను ఆయన ఆహ్వానించారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుండి లబ్ది పొందేందుకు ప్రభుత్వం వారికి అన్ని విధాలా సహాయాన్ని అందజేస్తుందని స్పష్టం చేశారు. భారతదేశాన్ని ప్రపంచానికి



బహిరంగ మార్కెట్‌గా అభివర్ణించిన ఆయన ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల వల్ల భారత దేశం వేగంగా ప్రగతి పథంలో దూసుకుపోతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పునాది వేయడం జరిగిందన్నారు. రాబోయే ఐదేళ్లలో విద్య, ఆరోగ్యం, సేవ, తయారీ, సాంకేతిక రంగాల అభివృద్ధిపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2027 నాటికి భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర మంత్రి అశ్విని అంచనా వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరిగాయన్నారు. గత 9 ఏళ్లలో ఇది 615.73 బిలియన్ డాలర్లకు చేరుకుందని వెల్లడించారు. భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా వేగంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం 620.44 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంది. మొత్తంమీద భారతదేశం గ్లోబల్ ఇంజిన్‌కు హబ్‌గా మారే రోజు దగ్గరలోనే ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా భారత్‌పై అంతర్జాతీయ విశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ వృద్ధి అంచనా 7 శాతంగా ఉందన్నారు. కానీ వాస్తవానికి, %చీూ% (నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్) ప్రస్తుత సంవత్సరానికి 7.3% చేరుకుందని, అదీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 7.3%గా ఉంటుందన్నారు.

# జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ పదవికై కీచులాట

(మొదటిపేజీ తరువాయి)

మధ్యలో పార్టీ టిక్కట్టు పొందలేక, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి, బి ఆర్ ఎస్ లో చేరిన వల్లెపు రేణుక మొగిలి ఎమ్మెల్సీ కవిత సహకారంతో చైర్పర్సన్ పదవి ఆదహించి, కొంత డబ్బు ఖర్చు చేసుకొన్నట్లు, ఆటారువతా మారిన పరిస్థితులలో ఎమ్మెల్సీ కవిత కూడా, ఇంచార్జ్ ఛైర్మన్ తో నే కాలం వెళ్లదీయలని, అవిశ్వాసం లాంటివి పెట్టవద్దని సూచించడంతో కథ ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ ఖాళీ ఉన్న ఛైర్మన్ పదవులను నింపాలని చూడడంతో, తప్పని సారి పరిస్థితులలో జగిత్యాల చైర్పర్సన్ పదవికి ఈ నెల 28 వ తేదీన ఎన్నికలకు ఎన్నికల కమీషన్ ప్రకటన ఇవ్వడంతో మళ్ళీ కదలిక వచ్చింది. కానీ ఎమ్మెల్యే తన మాట ప్రకారం సమిండ్ల వాణి కె పదవి అప్పజెప్పాలని నిర్ణయించడంతో, కౌన్సిలర్లలో రెండు మూడు వర్గాలు ఏర్పడ్డాయి.ఇప్పటికే జిల్లాపరాజా పరిషత్ పదవి మున్నూరు కాపు వర్గానికి ఉండడం, పట్టణంలో ఆతిపెద్ద వర్గమైన పద్మశాలీలకు ఎలాంటి పదవులు లేకపోవడంతో, తమకే ఆ పదవి ఇవ్వాలనే వాదనను ఎమ్మెల్యే అంగీకరించకపోవడంతో కొంత మంది కౌన్సిలర్లు అలక వహించినట్లు తెలుస్తుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా మున్నూరు కాపు అభ్యర్థి పోటీలో ఉండడంతో, ఆ వర్గాన్ని సముదాయించడానికే ఈ పదవి ఇస్తున్నట్లుగా కూడా ప్రచారంలో ఉంది. పదవి కాలం తక్కువగా ఉండడం, ప్రభుత్వం కూడా మారడంతో, కొంత మంది కౌన్సిలర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో, ఎందుకైనా మంచిదని, దాదాపు 20 మంది కౌన్సిలర్లను ఎమ్మెల్యే గోవాలో క్యాంప్ కి తరలించినట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలలో బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు పార్టీ మార్చి, కాంఆ



గ్రెస్ లో చేరడంతో పదవులు కాంగ్రెస్ వశం అవుతున్నాయి. కానీ డబ్బుతో రాజకీయం చేయడానికి ఇష్టపడని ఎమ్మెల్సీ జీవన రెడ్డి, చైర్పర్సన్ పదవి కై కౌన్సిలర్ల తో బేరసారాలు కొనసాగించడానికి ముందుకు రాకపోవడంతో, మళ్ళీ ఎలాగైనా బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి చైర్పర్సన్ గా ఎన్నిక అవుతారని అనుకొంటున్నారు.

## స్టేట్ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా చిన్నారెడ్డి

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి24 : తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల కోలాహలం కొనసాగుతోంది. తాజాగా ప్రణాళిక సంఘాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డికి స్టేట్ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బాధ్యతల్ని అప్పగించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చోటే దక్కని వారికి నామినేటెడ్ పోస్టులను ఖరారు చేస్తుంది కాంగ్రెస్ పార్టీ. వనపర్తి నియోజకవర్గం నుంచి ముందుగా చిన్నారెడ్డి పేరును ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చే సమయంలో ఆ సీటును మెఘా రెడ్డికి కేటాయించింది. చిన్నారెడ్డికి రాజ్యసభ సీటు ఇస్తారని జోరుగా ప్రచారం సాగింది. కానీ అనూహ్యంగా స్టేట్ ప్లానింగ్ కమీషన్ వైస్ చైర్మన్ బాధ్యతల్ని కట్టబెట్టింది కాంగ్రెస్ పార్టీ.మూడు రోజుల క్రితమే ఆర్థిక సంఘాన్ని కూడా నియమించింది సీఎం రేవంత్ సర్కార్. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను ప్రభుత్వం నియమించింది. కమిషన్ సభ్యులుగా ఎం. రమేశ్, సంకేపల్లి సుధీర్ రెడ్డి, మాలోత్ నెహ్రూ నాయక్‌లను నియమించారు. వీరురెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.

## అభ్యర్థుల ఎంపికపై బీజేపీ ఫోకస్

- 100 మంది అభ్యర్థులతో తొలి జాబితా సిద్ధం!
- ఫిబ్రవరి 29 విడుదల చేసేందుకు సన్నాహాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 : కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాలన్న లక్ష్యంతో సార్వత్రిక ఎన్నికలకు కమలనాథులు సన్నద్ధమవుతున్నారు. ఎన్డీయే కూటమి 400 సీట్లు, సొంతంగా బీజేపీ 370 సీట్లలో విజయం సాధిస్తుందని ఆ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఆ దిశగా సార్వత్రిక ఎన్నికలకు తమ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి నెలలో విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై బీజేపీ అగ్రనాయకత్వం ఫుల్ ఫోకస్ చేసింది. 100 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. తొలి జాబితా విడుదలకు సంబంధించి ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. వచ్చే వారం గురువారం (ఫిబ్రవరి 29)నాడు బీజేపీ కేంద్ర నాయకత్వం సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచే తమ పార్టీకి చెందిన 100 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించిందట. ఈ జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్లు కూడా ఉండే అవకాశమున్నట్లు సమాచారం. బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఫిబ్రవరి 29న సమావేశమై.. అభ్యర్థుల తొలి జాబితాపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అదే రోజు తొలి జాబితా విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాల్లో 370 స్థానాల్లో విజయం సాధించాలని, ఎన్డీయే కూటమి 400 స్థానాల్లో విజయం సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో బీజేపీ కేంద్ర నాయకత్వం వచ్చే గురువారం విడుదల చేయనున్న తొలి జాబితా రాజకీయ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం యూపీలోని వారణాసి నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తున్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని ఇక్కడి నుంచి విజయం సాధించారు. 2014లో ప్రధాని మోదీకి 3.37 లక్షల మెజార్టీ దక్కగా.. 2019 ఎన్నికల్లో అంతకు మించి 4.8 లక్షల మెజార్టీతో మోదీ విజయం సాధించారు. బీజేపీ వృద్ధనేత ఎల్కే అద్వానీ గతంలో ప్రాతినిధ్యంవహిస్తూ వచ్చిన గుజరాత్‌లోని గాంధీనగర్ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో అమిత్ షా పోటీ చేసి గెలిచారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాల్లో గెలిచే లక్ష్యంతో పనిచేయాలని గత వారం పార్టీ శ్రేణులకు ప్రధాని నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. రాబోయే 100 రోజులు చాలా కీలకమని స్పష్టంచేశారు.

# మేడారం జాతర విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న గ్రామంలోని చిన్న ఆలయంలో ప్రతిష్ఠించిన సారలమ్మను జాతరలో మొదటి రోజు సాయంత్రం మేడారంలోని గద్దె వద్దకు చేరుస్తారు. మధ్యాహ్నమే కన్నెపల్లికి చేరుకున్న వడ్డెలు రెండు గంటల పాటు పూజలు చేస్తారు. కన్నెపల్లి గ్రామ ఆడపడుచులు హారతులు ఇచ్చి అమ్మవారిని మేడారానికి సాగనంపుతారు. సారలమ్మ గద్దె పైకి రాకముందే ఏటూర్‌నాగారం మండలంలోని కొండాయి నుండి గోవిందరాజులను, పూనుగోండ్ల నుంచి పగిడిద్ద రాజును అటవీ మార్గం మీదుగా కాలినడకన మేడారానికి తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్టిస్తారు. సారలమ్మ సహా వీరిని తీసుకువచ్చే ముగ్గురు వ్డడెలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అనంతరం వారి వారి గద్దెలపై ప్రతిష్టింపజేస్తారు. రెండోరోజు సమ్మక్క తల్లి సాయంత్రం గద్దెపైకి వస్తుంది. మొదటగా గిరిజన పూజారులు మేడారం సమీపంలోని చిలుకల గుట్టకు వెళ్ళి వెదురు కర్రలు తీసుకొచ్చి గద్దెలపై పెట్టి పూజిస్తారు. ఆ తర్వాత సమ్మక్క పూజా మందిరం నుంచి పసిడి కుండలను తెచ్చి గద్దెలపై నెలకొల్పుతారు. తర్వాత మళ్ళీ చిలుకల గుట్టకు వెళ్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చే మహాఘట్టం మొదలవుతుంది. తల్లి రూపాన్ని చేతపట్టుకున్న మరుక్షణమే ప్రధాన వ్డడె తన్మయత్వంతో పరుగుపరుగున గుట్ట దిగుతాడు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపి వనదేవతకు ఆహ్వానం పలుకుతారు. సమ్మక్క రాకతో మేడారం మొత్తం శివసత్తుల పూనకాలతో హోరెత్తి ఊగిపోతుంది. దారి పొడవునా భక్తుల జన ప్రవాహం సాగుతుంది..అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా జంతు బలులు ప్రారంభమవుతాయి. కుంకుమ భరణిని గద్దెలపైకి చేర్చిన తర్వాత మహా జాతర లాంఛనంగా ప్రారంభమవుతుంది. గద్దెలపైకి సమ్మక్క-సారమ్మ వనదేవతలు ఆసీనులైన మూడో రోజు భక్తులు పోటెత్తుతారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అమ్మవార్లను దర్శించుకుంటారు. కానుకలు చెల్లిస్తారు. వన దేవతలను ఆడపడుచులుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, చీరె, సారె, పెడతారు. ఒడిబియ్యం పోస్తారు. తలనీలాలు సమర్పించుకుంటారు. ఎత్తు బంగారం నైవేద్యాలుగా పెడతారు. మేడారం మహాజాతరలో నాలుగోరోజు సమ్మక్కను చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవింద రాజును కొండాయికి, పగిడిద్ద రాజును పూనుగొండ్లకు కాలనడకన తీసుకెళ్తారు. ఇలా దేవతలు వన ప్రవేశం చేయడంతో మహాజాతర ముగుస్తుంది. సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల సమయంలో ఈ క్రతువు ముగుస్తుంది. సమ్మక్క చిలుకల గుట్టపైకి, సారలమ్మ కన్నెపెల్లికి తరలివెళ్ళిన తర్వాత భక్తులు తిరుగు పయనమవుతారు. మళ్ళీ రెండేళ్ళపాటు భక్తులు తల్లుల రాక కోసం వేచి చూస్తుంటారు.

# సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం

### యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల వేగవంతం

### రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### వైటీపీఎస్ ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి24 : తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించే దిశగా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. వైటీపీఎస్‌లో కీలకమైన ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తవడంతో పనులు వేగవంతం చేయాలని జెన్‌కో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్ల పాలెంలో చేపట్టిన యాదాద్రి అల్ట్రా మెగా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్తు కేంద్రం' ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే వైటీపీఎస్ పనుల పురోగతిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించి పరిశీలించారు. వైటీపీఎస్‌లో ఉన్నతాధికారులతో ముగ్గురు మంత్రులు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్లాంటులో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది? బొగ్గును తరలించడానికి రైల్వే ట్రాక్ నిర్మాణం పురోగతి, గతంలో చేసిన పనుల్లో బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు, ఇంకా ఎంత మందికి పరిహారం ఇవ్వాల్సి



ఉంది.. తదితర అంశాలపై మంత్రులు జెన్‌కో అధికారులతో సమీక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ పవర్, రెనెవబుల్ ఎనర్జీ వైపు వెళ్తుంటే గత పాలకులు థర్మల్ పవర్ వైపు దృష్టిసారించారనీ మంత్రులు చెప్పారు. పలు కారణాలతో ఇప్పటికే జాప్యం చేయడం మూలంగా రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్ లో ఉన్న స్కిల్ అండ్ స్కిల్డ్ కలిగిన వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. ప్లాంట్ కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలు శరవేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గ్రీన్ పవర్ ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చేటప్పటికీ యాదాద్రి థర్మల్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్లాంట్ పనులు చేపట్టిన ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్ తొలి దశ పూర్తి చేయకపోతే సంస్థకు చెడ్డ పేరు వస్తుందని విషయాన్ని ఆ సంస్థ అధికారులు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు.

# కాంగ్రెస్ ఢిల్లీ గులామిని వదులుకోవాలి !

తెలంగాణలో కాంగ్రెస్ విజయం అన్నది కేవలం కెసిఆర్ వ్యతిరేకతతోనే అని కాంగ్రెస్ నేతలు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది.అలాగే ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలి. నిర్ణయాలు త్వరితంగా తీసుకుంటూనే.. వాటి అమలును కూడా వేగవంతం చేసుకోవాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను అతిగా ఇక్కడ జోక్యం చేసుకోకుండా చూసుకోవాలి. గత వాసనలు వదిలించుకుంటే తప్ప ఇక్కడి రేవంత్ ప్రభుత్వం నిలదిక్కుకోలేదు. ఇక్కడి నిరుద్యోగ యువత, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారు. ఎందరో ఆత్మార్పణం చేశారు.. వారి పోరాటంతో తెలంగాణ సాకారమయ్యింది. అయితే అది తన ప్రతిభ వల్లనే అని, తను మృత్యుముఖంలోకి వెళ్లి వచ్చానని ప్రకటించుకోవడంతో పాటు, పదేళ్ల పాటు కెసిఆర్ నిరంకుశంగా పాలించారు. విర్రవీగిన పాపానికి మూల్యం చెల్లించారు. దాని ఫలితమే కరిమింగిన వెలగపండులాగా ఇప్పుడు అప్పుల కుప్పలు బయటపడ్డాయి. నాయకుల అవినీతి బయటపడుతోంది. ఈ విషయాలను గుర్తించి ఇచ్చిన హామీల అమలు కోసం చేసే కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దలను పదేపదే పాల్గొనేలా చేయడం వల్ల ప్రజల్లో విమర్శలపాలు కాకతప్పదు. కేవలం ఇక్కడి ప్రజలే తమ హీరోలుగా కార్యక్రమాలతో ముందుకు సాగాల్సి ఉంది. అదే రేవంత్ ప్రభుత్వానికి శ్రీరామరక్ష కానుంది. మల్లికార్జున ఖర్గే మొదలు, రాహుల్, సోనియా, ప్రియాంకలను పార్టీపరంగా ఢిల్లీకి వెళ్లి కలవడం వేరు..అదే పనిగా వారే ఇక్కడి కార్యక్రమాలను నిర్దేశించేలా చేసుకోవడం వల్ల ముప్పు ఉంటుందని గుర్తించాలి. గతంలో ప్రతిపనికి ఢిల్లీకి వెళ్లిన కారణంగానే కాంగ్రెస్ భ్రష్టుపట్టి, ప్రాభవం కోల్పోయింది. గతానుభవాలను బట్టి నడుచుకోవాల్సి ఉంది. అందుకే తెలంగాణ పాలనలో వారికి దూరంగా నిర్ణయాలు జరగాలి. వారి ప్రమేయం పెరిగితే మొదటికే మోసం జరగగలదు. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఢిల్లీ నుంచి పాలన అన్న విమర్శలు వస్తున్నాయి. రేపటి సిలిండర్, గృహజ్యోతి పథకాలను కూడా ఇక్కడి సామాన్యులతో ప్రారంభించి ఉంటే మరింతగా రేవంత్ ప్రతిభ పెరిగేది. ఎందుకంటే ఇండియా కూటమిలో లుకలుకలు ఇక్కడ ప్రభావం పడకుండా చూసుకోవాలి. అవకాశం వస్తే మింగేద్దామన్న రీతిలో బిజెపి, బిఆర్ఎస్ కాచుకుని ఉన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ ప్రకటిస్తోంది. వారసత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే ఉన్నా పెత్తనం సోనియా, రాహుల్‌దేనని తెలిసిందే. ఇప్పటికే కూటమి నుంచి నితీశ్ వైదొలిగారు. నీరసపడిన కాంగ్రెస్ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. యూపిలోని అమేథీని ఇప్పటికే కోల్పోగా, రాయబరేలిలో కూడా విజయం కష్టమే. కాంగ్రెస్ ముక్త రాజకీయాలను మోడీ బలంగా తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లనైనా కైవసం చేసుకోగలదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలను తీసుకుంటే.. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల్లో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటిసారి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కూడాకాంగ్రెస్ పరిస్థితి మెరుగు పడలేదు. 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది.. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి కాంగ్రెస్

స్వయంకృత రాజకీయాలే కారణం. ఈ నిజాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు త్వరగా గుర్తించాలి. ఇక్కడ కాంగ్రెస్ ముసుగు ఉన్నా ప్రజలు మాత్రం కేవలం కెసిఆర్, బిజెపి వ్యతిరేకతతో గెలిపించారని తెలుసుకోవాలి. అలా తెలుసుకుని తమ రాజకీయాలన్నీ ఉద్యమ పోరాటాల చుట్టూ సాగించాలి. అప్పుడే తెలంగాణలో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఎందుకంటే ఇప్పటికే బిజెపి బిఆర్ఎస్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బిఆర్ఎస్ ఒక్కసీటు గెల్చినా దేశానికి లాభం లేదని వాదిస్తోంది. బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని వాదిస్తోంది. కవితకు సిబిఐ సమన్లు పంపడం ద్వారా బిఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు లేదని చెబుతోంది. కర్నాటక పరిస్థితులు వేరు. తెలంగాణ ప్రజలు వేరు. తెలంగాణలో ప్రజలు సెంటిమెంట్‌కు విలువనిస్తారు. అది చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డికి, ఆయనతో పాటు అధికారం పంచుకున్న బృందానికి ఉంది.

ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, పోరాటయోధులను ఆలంబనగా చేసుకుని వారి కార్యక్రమాలు సాగాలి. మేధావుల సూచనలు,సలహాలు తీసుకోవాలి. గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు కూడా వీరినే హీరోలుగా తీసుకుని అమలు చేయాలి. అంతేగానీ ప్రియాంక రాకవల్ల మైలేజీ వస్తుందని అనుకుంటే పొరపాటే. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరంగా పరిష్కరించే క్రమంలో సొంతంగా నిర్ణయాలు ఉండాలి. అదేపనిగా ఢిల్లీ యాత్రలను మానుకోవాలి. అవసరమైతే లోపాయకారిగా హాట్‌లైన్‌లో మాట్లాడుకోవాలి.

అప్పుడే రేవంత్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కెసిఆర్ చేసిన తప్పులను చేయకుండా ముందుకు సాగాలి. అన్ని వర్గాలకు తాము అండగా ఉన్నామని చెప్పడం వేరు..ఆచరించి చూపడం వేరు. రైతుబంధు, కాళేశ్వరం,గొర్రెల పథకంలో దుబారాను, అవినీతిని బయటపెట్టి నిలదీయగలిగితే ప్రజలు హర్షిస్తారు. అదేపనిగా విమర్శలతో కాలం గడిపితే కూడా ప్రజలు ఆదరించారు. ఈ జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగితేనే రేవంత్ రెడ్డి సమర్థమైన సిఎంగా రాణిస్తారు.

# అమరావతిపై ఇక దాగుడుమూతల తగవు


**పంతాలకు పోతే నష్టపోయేది ఎపి ప్రజలే**

**రాజధాని కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి**

అమరావతి,ఫిబ్రవరి24 : అమరాతి విషయంలో సిఎం జగన్ తప్పటడుగులు వేశారని కోర్టులు, కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం మాత్రం తప్పుదిద్దుకునే ప్రయత్నాల్లో లేదు. విశాఖ రాజధాని అని చెబుతున్నవారు మూడేళ్ల క్రితమే ఆ పని చేసివున్నా ఈ పాటికి ఎపికి ఓ రాజధాని అనేది ఉండేది. విశాఖను కూడా రాజధాని చేసుకుంటే అడ్డుకునే వారు ఉండేవారు కాదు. కానీ మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకాలు ఎపి పురోభివృద్దిని దెబ్బతీసాయి. రాజధాని అన్నది లేకుండా చేశాయి. అందుకే దానిని సరిదిద్దు కోవాలని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇంకా దీనిని కొనసాగించడం వల్ల లాభం లేదన్న విషయం గత నాలుగేళ్లుగా అయినా సిఎం జగన్‌కు అర్థం అయివుండాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేశారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి దోహదపడి ఉంటే బాగుండేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎన్నికల వేళ దీనిపై ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దన్నారు. రాజధాని లేని రాజ్యం లాగా ఆంధ్రప్రదేవ్ కొనసాగడం ఎంతమాత్రం సరికాదన్నారు. గత ప్రభుత్వంపై కక్షతో ఇలాంటి కీలక విషయంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్‌ను అంధకారంలో పడేశాయని అన్నారు. అమరావతి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అమరావతి రాజధాని కోసం కేంద్రంతో పోరాడాలని కాంగ్రెస్ నేతలు వైఎస్ షర్మిల, తులసిరెడ్డిలు కూడా డిమాండ్ చేశారు. తాము అమరావతికి కట్టుబడి ఉంటామని అన్నారు. అమరావతిని పక్కన పెట్టడంతో ఎపికి పెట్టుబడులు వెనక్కి పోయాయని టిడిపి నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. రైతుల ఆందోళనతో జై అమరావతి నినాదం హోరెత్తింది.. అమరావతే తమ అంతిమ లక్ష్యం అంటూ అక్కడి రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమ పిడికిలి బిగించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. అడ్డంకులు కల్పించినా.. కేసులు పెట్టినా అడుగులు వెనకకు పడవంటూ తెగేసి చెప్పారు. రైతులు, మహిళలు దీక్ష చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నినదించారు. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న రైతులు, మహిళలు అదే పట్టుదల కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమ లక్ష్యాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణం తన విధానాన్ని సమీక్షించుకోవాలని ఆయా పార్టీల నేతలు సూచించారు. అమరావతి రాజధాని గ్రామం వెలగపూడిలో దీక్ష కొనసాగిస్తున్నారు. అమరావతి ప్రజాదీక్ష పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దుతు తెలిపాయి. అలానే ప్రజా, కులసంఘాలు తమ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వం మూడురాజధానుల బిల్లుల్ని మళ్లీ తేస్తే.. తాడోపేడో తేల్చుకునేవరకూ విశ్రమించబోమని రైతులు తేల్చిచెప్పారు. అమరావతి సాధన ప్రతిజ్ఞ..పాలనా రాజధానిగా అమరావతిని ప్రకటించే వరకు తమ పోరు ఆపేది లేదని దళిత జేఏసీ నేతలు చెప్పారు. రైతులు, మహిళలు తలపెట్టిన దీక్షలకు అన్ని పార్టీలకు చెందిన మహిళా నేతలు తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పంతాలకు పోకుండా చూడాల్సి ఉంది. ఇకపోతే ప్రబుత్వం కూడా ఖచ్చింతంగా నిర్ణయం ప్రకటించాలి. రోజుకో మాట మాట్లారాదు. మంత్రులు ఒకమాట, సజ్జల ఒకమాట మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. తాము విశ్వాఖకే కట్టుబడి ఉన్నామంటున్న వారు మిగతా విషయాలు మాట్లాడకుండా రాజధానిని తరలించే ప్రయత్నాలు చేయాలి.




# రాజ్యసభకు తిరిగి ఎన్నిక.. అధికులకు క్రిమినల్ చరిత్ర




న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 : రాజ్యసభకు తిరిగి ఎన్నికైన వారికి క్రిమనల్ చరిత్ర ఉందని తేలింది. 2004 నుంచి 2019 మధ్య తిరిగి ఎన్నికైన 23 మంది ఎంపిల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నాయని ఎన్నికల సంబంధిత డేటాను విశ్లేషించే సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఎడిఆర్) వెల్లడించింది. 12 మందిలో తొమ్మిది మంది ఎంపిలపై హత్య, హత్యాయత్నం, దోపిడీ సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొంది. 2004-2019 మధ్య అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్‌లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది. జాబితాలో చేర్చబడిన 23 మంది ఎంపిలలో 52 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, 39 శాతం మంది ఎంపిలపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోద య్యాయని పేర్కొంది. పార్టీల వారీగా గణాంకాలను కూడా ఈ నివేదికలో సమర్పించారు. బిజెపికి తిరిగి ఎన్నికైన 17 మంది ఎంపిలలో ఏడుగురు (41 శాతం), ముగ్గురు కాంగ్రెస్ (100 శాతం) ఎంపిలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) నుండి ఎన్నికైన ఒకరు, శివసేనకు చెందిన ఓ ఎంపిలు తమపై ఉన్న క్రిమినల్ కేసులను అఫిడవిట్‌లో ప్రకటించారు. తిరిగి ఎన్నికైన ఎంపిలలో నలుగురు తమ విద్యార్హతలను 10వ తరగతి, 12వ తరగతి మధ్య ఉన్నట్లు ప్రకటించగా, 18 మంది గ్రాడ్యుయేషన్, అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్నట్లు తెలిపారు. వారిలో ఒకరు డిఎ÷-లోమా హోల్డర్ అని ప్రకటించారు. ఈ ఎంపిలలో 19 మంది వయస్సు 51 నుండి 80 సంవత్సరాల మధ్య ఉండగా, నలుగురి వయస్సు 40 నుండి 50 ఏళ్ల మధ్య ఉంది. తిరిగి ఎన్నికైన 23 మంది ఎంపిలలో కేవలం ముగ్గురు మాత్రమే మహిళలు ఉన్నారు. 2004లో ఈ ఎంపిల సగటు ఆస్తి విలువ రూ.1.52 కోట్లు ఉండగా, 2009 నాటికి రూ.3.46 కోట్లుకి చేరుకుంది. 2014లో రూ.9.85 కోట్లు, 2019లో రూ.17.51 కోట్లకు చేరుకున్నట్లు నివేదిక తెలిపింది.

# రాజకీయాలకు డబ్బే ప్రధానం అయిపోయింది

**తొలిజాబితాపై టీడీపీ ఇంచార్జి మండలి బుద్ధ ప్రసాద్ అసంతృప్తి**



అమరావతి,ఫిబ్రవరి24 : ఏపీలో తెలుగుదేశం, జనసేన కూటమి పోటీ చేయబోయే స్థానాలు, అభ్యర్థుల మొదటి జాబితా విడుదల చేసింది. దీనిపై ఇరుపార్టీల నేతలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అవనిగడ్డ అభ్యర్థి పేరును ప్రకటించనందుకు అక్కడి టీడీపీ ఇంచార్జి మండలి బుద్ధ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా తన భావనను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన కూటమి పోటీ చేయబోయే స్థానాలు, అభ్యర్థుల వివరాలతో మొదటి జాబితా విడుదల చేసింది. మొదటి జాబితాలో మొత్తం 118 సీట్లను ప్రకటించారు చంద్రబాబు. అందులో టీడీపీ నుంచి 94 మంది అభ్యర్థులను ప్రకటించగా.. జనసేన 24 అసెంబ్లీ స్థానాల్లో, మూడు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇదే ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్?గా మారింది. అవనిగడ్డ సీటును ప్రకటించకుండా పెండింగ్?లో పెట్టింది టీడీపీ. దీంతో అక్కడి టీడీపీ ఇంచార్జి మండలి బుద్ధ ప్రసాద్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ట్వీట్ చేశారు. తనకు టిక్కెట్ ప్రకటించకపోవడం పట్ల ఆనందంగా ఉన్నానంటూ వ్యంగ్యంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పంజరంలో నుంచి బయటకు వచ్చిన పక్షిలా ఉన్నానన్నారు బుద్ధ ప్రసాద్. ప్రస్తుతం రాజకీయాలకు డబ్బే ప్రధానం అయిపోయిందని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో పదవులను అడ్డుపెట్టుకుని ఎప్పుడూ దోచుకోలేదని ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. తన ప్రస్తుత పరిస్థితిని కార్యకర్తలు, ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్లు వస్తున్నాయి. దీంతో తొలి జాబితాలో తన పేరు లేకపోవడంపై తనలోని అసంతృప్తిని ఇలా వెళ్లగక్కారు బుద్ధ ప్రసాద్. 'నా ఆలోచనలు, నేను నమ్మిన సిద్దాంతాలు మీకు తెలుసు. పదవులకోసం పుట్టలేదు. పదవులు లభించినప్పుడు ప్రజలకు మేలు చేయడానికి మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాను తప్ప ఆ పదవులను అడ్డుపెట్టుకుని దోచుకోలేదు, దాచుకోలేదు.రాజకీయాలు మన కళ్లముందే మారిపోయాయి. డబ్బు రాజకీయాలకు ప్రధానమై పోయింది. ఓటరుని కొనుగోలు వస్తువుగా రాజకీయపక్షాలు భావిస్తున్న తరుణంలో ధనవంతులకోసం అన్వేషిస్తున్న తరుణంలో నాబోటి వాడు ఎన్నికల్లో నిలబడాలని భావించడం కూడా సమంజసం కాదు. పరిస్దితులను కార్యకర్తలు, ప్రజలు అర్థం చేసుకోండి. దయచేసి వేరేవిధంగా ఆలోచించవద్దు.' అంటూ ఎక్స్ వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రవేశ పరీక్షల కాలం ఇది

**సబ్జక్టుపై పట్టు సాధిస్తేనే సీటు సాధ్యం**



హైదరాబాద్,ఫిబ్రవరి24 : ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య కోర్సులను ఉత్తమ విద్యాసంస్థల్లో చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అందుకే చాలా మంది అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదువుకోవాలని పాఠశాల స్థాయి నుంచే కలలు కంటారు. వీటిని నిజం చేసుకోవాలంటే ఏదో ఒక పోటీ పరీక్షలో ఉన్నతమైన ర్యాంకు సాధించక తప్పదు. కొన్ని రోజుల తేడాతో అనేక పరీక్షలన్నీ వేసవి కాలంలో ఒకేసారి ఉంటాయి. ముందస్తు ప్రణాళికలు లేకుంటే విద్యార్థులు మంచి మార్కులు సాధించడం కష్టంగా మారుతుందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే అనేక సెట్‌లకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల య్యాయి. వీటిలో దేనికి సన్నద్ధం కావాలో విద్యార్థులు ముందుగా నిర్ణయించుకోవాలి. పదో తరగతి వారికి పాలిటెక్నిక్, టీఎస్ ఆర్‌జేసీ, ఇంటర్ పూర్తి చేసిన వారికి సెట్ తదితర పరీక్షలు ఉండగా డిగ్రీ వారికి ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, ఓయూ, కేయూ సెట్, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన సెట్, బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన వారికి పీజీఈసెట్ తదితర పోటీ పరీక్షలుంటాయి. ఇంటర్‌తో యూజీడీపీఈడీ (అండర్‌గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్), డిగ్రీ పట్టాతో బీపీఎడ్ కోర్సులకు సంబంధించిన ప్రవేశ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. దీని కోసం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. న్యాయశాస్త్రంలో ఆసక్తి ఉన్న వారు చేసే లాసెట్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలోని లా కళాశాలల్లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన లాసెట్, పీజీ లాసెట్ షెడ్యూల్ విడుదలైంది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారు. వివిధ సెట్లకు షెడ్యూల్‌ను కూడా అధికారులు విడుదల చేశారు. దీని కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

# స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం

- **14 అంతస్తుల భవనంలో అంటుకున్న మంటలు**
- **నలుగురు మృతి, మరో 20 మంది గల్లంతు**



వాలెన్సియా,ఫిబ్రవరి24 : స్పెయిన్‌లోని వాలెన్సియాలో 14 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్టుగా తెలిసింది. మరో 20 మంది గల్లంతయ్యారు.. వారందరి పరిస్థితి ఎలా ఉందోనని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. నివేదికల ప్రకారం, గురువారం సాయంత్రం 5.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో దాదాపు 350 మంది భవనంలో చిక్కుకుపోయారు. మంటల నుండి తప్పించుకోవడానికి చాలా మంది అనేక అంతస్తుల నుండి దూకారు. ఈ క్రమంలో భవనం కింద నెట్‌లను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే టవర్ అంతటా మంటలు వ్యాపించినట్టుగా సమాచారం. ఆ బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైరల్ అవుతున్న వీడియోలో ఒక వ్యక్తి బహుళ అంతస్తుల నుండి కిందకు దూకడం కనిపించింది. అతనిని రక్షించడానికి, కింత కొందరు మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. మరోవైపు భవనంలోని ఇళ్లలో ఉంటున్న చాలా మంది వ్యక్తులు తమ ఫ్లాట్ బాల్కనీ నుండి సహాయం కోసం అర్థించటం కనిపించింది. దాదాపు 20 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. బలమైన గాలుల వల్ల మంటలు మరింత పెరుగుతున్నాయి.. క్రేన్ల ఆధారంగా ఫైర్‌ఫైటర్లు స్థానికుల్ని రక్షించారు. ఈ ఘటనలో భవనం పూర్తిగా మంటల్లో దగ్ధమైనట్టుగా తెలుస్తుంది. మంటలు అంటుకున్న బిల్డింగ్‌లో 138 ఫ్లాట్లు ఉన్నాయి. దాంట్లో 450 మంది ఇక్కడ నివసిస్తున్నారు. ప్రమాదంలో ఆరుగురు అగ్నిమాపక సిబ్బందితో పాటు మొత్తం 15 మంది గాయపడ్డారు. అయితే వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. గల్లంతైన 20 మంది కోసం గాలిస్తున్నామని వాలెన్సియా మేయర్ మారియా జోస్ కటలా తెలిపారు.

# సంతోషం అంతా మన చేతుల్లోనే ! ( ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,ఫిబ్రవరి24 : సంతోషంగా ఉండటమనేది మనం ఎంత సంపాదించామనే దానిపై ఆధారపడి ఉండదు. సంతోషమన్నది మన మానసిక ప్రవర్తనను బట్టి ఉంటుంది. మనస్సులో ఆనందంగా ఉండాలన్న సంకల్పం ఉంటే అందుకు అడుగు పడుతుంది. ప్రతి విషయానికి ఆందోళన చెందితే...డబ్బు, స్వార్థం కోసం తంటాలు పడితే ఆనందం ఆవిరైపోయింది. ఎన్ని ఆధునిక పరికరాలు మన వద్ద ఉన్నాయనే దానిపైనా ఉండదు. అవసరాన్ని బట్టి భారమైన విషయాల్ని తేలిగ్గా భావించాలి. జీవితంలో చేసిన తప్పులన్నీ క్షమించేయాలి. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగవులు మానాలి. మనం మానవ మాత్రులమని గుర్తించాలి. బాధ కలిగించే సంఘటనలు జీవితంలో ఎన్నో జరుగుతాయి. పగలు, ప్రతీకారాలు సంతోషాన్నివ్వవు. పగ అంటే తలపై ఎంతో భారంతో ఒక కొండ పైకి ఎక్కుతున్నట్టే! బరువంతా దింపుకొంటే కొండ ఎక్కడం తేలిక. అవసరాన్ని బట్టి మన డబ్బు, శారీరక శ్రమ, మానసిక శ్రమ, మన సమయాన్ని ఇతరులకివ్వాలి. ఇతరుల విజయం, సంతోషం కోసం పాటుపడాలి. అనాథలకు సేవ చేయడంలో సంతోషం దాగి ఉంటుంది. 'సొంత లాభం కొంత మానుకు పొరుగు వానికి తోడు పడవోయ్... అన్న గురజాడ మాటలను చేతల్లో చూపెడితే సంతోషం జాడ తెలుస్తుంది. ఇతరులు సంతోషం కోసం చెట్టు ఫలాలిస్తుంది. ఇతరుల సంతోషం కోసం ఆవు పాలిస్తుంది. ఇతరుల సంతోషం కోసం నది నీరిస్తూ ప్రవహిస్తుంది. అందుకే, ఇతరులు సంతోషం కోసం కొంతైనా మనిషన్న వాడు కృషిచేయాలి. అప్పుడే మానవ జన్మకు సార్థకత.

prajamantalau daily pages (25-02-24)R_times of varha main (13-2).qxd 2/25/2024 5:00 AM Page 4



## బుగ్గారంలో పోచమ్మ రథోత్సవంలో ఎడ్ల బండ్ల పోటీలు

బుగ్గారం ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో పోచమ్మ రథోత్సవంలో బాగంగా శనివారం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిధిగా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ పాల్గొన్నారు. వారి తో పాటు పోచమ్మ ఆలయ కమిటీ చేర్మెన్ మసర్తి నర్సయ్య, వైస్ చేర్మెన్ పరుమల శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## విస్డం హై స్కూల్ విద్యా విధానం అభినందనీయం

### తహసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం

రాయికల్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



రాయికల్ పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో విస్డం హై స్కూల్ స్పర్శ పేరుతో ఆన్వల్ డే వేడుక ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాహాసిల్దర్ మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతు విభిన్నమైన విలువలతో కూడిన విద్య విధానం అవలంభిస్తు విద్యార్థులలో విద్యతో పాటు సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక దేశం పట్ల భక్తి, భాధ్యతలతో విలువలను నేర్పుతూ విద్యార్థులకు క్రమ శిక్షణ తో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటలు వేస్తున్న విస్డం హై స్కూల్ రాజు రెడ్డి విద్యా విధానం అభినంద నీయం అని అన్నారు. పురపాలక సంఘం చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతు పాఠశాల స్థాయి విద్యానే విద్యార్థులకు కీలకం అని ఈ చదువు ఎంత నాణ్యతగా ఉంటే విద్యార్థులు భవిష్యత్ లో అనేక రంగాలలో ఉన్నతంగా రాణిస్తారని ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతు ఈ విద్యా సంస్థ తీరు అభినందనీయం అని విద్యార్థులు సత్య నాదెళ్ళ లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని, లేని లేకుండా వేకువ జామున లేపి చదివి పించాలని క్రీడలతో కూడిన విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా 11వ సారి కొండగట్టు గిరి ప్రదక్షిణ

కొడిమ్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా మల్యాల మండలం లో ప్రతి పౌర్ణమిని పురస్కరించుకుని కొండగట్టు గిరి ప్రదక్షిణ 11 సారి చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధాన అర్చకులు సురేష్ అత్మారాం మహారాజ్ రామదాసి ఆద్వర్యంలో ఘనంగా జరిగింది. శనివారము ఉదయము 7:00 గంటలకు వివిధ జిల్లాల నుండి వచ్చిన సాధువులు కొండగట్టు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. కొండ గట్టు దిగువ నుండి ప్రారంభ మయి మద్దుట్ల,మల్యాల మీదుగా కొండగట్టుకు పాద యాత్ర జరిగింది. మధ్య లో భక్తులకు మంచి నీరు, చల్ల పాకెట్లు, అరటి పండ్లు, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధువులు కమలేష్ దాస్, సర్వేస్య రాంబిక శివ యోగి, యోగిష్ ప్రభువు, స్వామీ నాదానంద, నంద గిరి,తదితరులు, తెలంగాణ లోని వివిధ జిల్లాల, కొడిమ్యాల, మల్యాల మండలం లోని వివిధ గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడే జనగామలో కవన తీగ పుస్తక ఆవిష్కరణ



జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

ఈనెల 25న యువ కవి, సంగీత దర్శకులు చిలుమోజు సాయికిరణ్ రచించిన కవన తీగ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ జిల్లా కన్వీనర్ జి.కృష్ణ కోరారు. శనివారం శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఐక్యవేదిక కళా,సాహితి సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవులు కళాకారుల ఐక్య వేదిక, స్వేచ్ఛ పబ్లికేషన్స్ జేఎస్కే ట్యూన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విజయ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సాయికిరణ్ 26వ జన్మదినం పురస్కరించుకొని కవన తీగ పుస్తక ఆవిష్కరణతో పాటు గుమ్మడిల్ల ఎక్సలెన్సీ అవార్డ్స్ ప్రధానం,విద్యా, సాహిత్య సంగీత కళా రంగాలలోని గురువులకు ఆత్మీయ సత్కారం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విరసం కవి శాఖమూరి రవి, ప్రముఖ సినీదర్శకులు తాళూరి రాజ్, యుట్యూబ్ ఫేం సింగర్ యాక్టర్స్ వస్తున్నారని తెలిపారు.కళా,సాహితి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో కవి చిలుమోజు సాయికిరణ్, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహచారి, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, అంబాల శివనాథ్ గౌడ్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్,టి.రామచంద్రం, అంకాల సోమయ్య,జోగు సుదర్శన్, కూచిపూడి కిరణ్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.





జగిత్యాల అర్బన్ మండలం అంబారిపెట్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 24వ వార్షిక బ్రహ్మోత్సవము సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే దంపతులు డా. సంజయ్ కుమార్, రాధిక, జడ్పీ చైర్ పర్సన్ దంపతులు దావ వసంత, సురేష్ లు

## లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసమే బిజెపి, సిబిఐ డ్రామా

### జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



ఎమ్మెల్సీ కవితను రాజకీయంగా బద్‌నాం చేసి, లబ్దిపొందాలన్నదే బిజెపి లక్ష్యం... ఎమ్మెల్సీ కవిత నిందితురాలు కాదు....కేవలం బాధితురాలు మాత్రమే! బిజెపి అడుగులకు మడుగులొత్తకపోతే...కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారు.. బెదిరింపులు బీఆర్ఎస్ కు కొత్తకాదు. ధైర్యమే మా ఆయుధం. జగిత్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో లబ్దిపొందాలన్న దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బిజెపి ప్రభుత్వం సి.బి.ఐ విచారణ పేరిట డ్రామా మొదలు పెట్టిందని విమర్శించారు జగిత్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, బిజెపి పార్టీ తెలంగాణలో గెలిచే పరిస్థితి లేదన్న విషయాన్ని గుర్తించి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితపై రాజకీయంగా కుట్రలకు తెరలేపిందన్నారు. లేని లిక్కర్ స్కామ్ పేరిట ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్సీ కవితను ఇబ్బందిపెట్టిన బిజెపి, ఎన్నికల తరుణంలో మరోసారి సి.బి.ఐ విచారణ పేరిట సీఆర్‌పీసీ 41 నోటీసులంటూ బద్‌నామ్ చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం గత పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై, ప్రజాప్రతినిధులపై వేదింపు చర్యలకు పాల్పడుతూనే ఉందన్నారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలపై కేసులు నమోదు చేయడం, తమ అధీనంలో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలు అయిన ఎన్‌ఫోర్స్?మెంట్ డైరెక్టరీ, సి.బి.ఐ, ఇంటలీజెన్స్?, ఇన్‌కంటాక్స్ లాంటి సంస్థలను ఉసిగొల్పుతూనే ఉందన్నారు. ఆప్ పార్టీకి చెందిన డిల్లీ ముఖ్యమంత్రి బిజెపి ప్రభుత్వంకు కొరకరాని కొయ్యగా మారాడని, బిజెపి చెప్పినట్లు వినడం లేదన్న కసితోనే ఆయనపై ఇప్పటికి ఆరుసార్లు ఈడీ విచారణ నోటీసులు ఇచ్చారన్నారు. ఆప్ పార్టీ ఒక్కటే కాదు, దేశంలో ఏ పార్టీ బిజెపి అసంబద్ధ విధానాలను, పాసిజాన్ని ప్రశ్నించినా వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు సర్వసాధారణం అయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం చెప్పినట్లు విన్నవారిపై ఎంత పెద్ద ఆరోపణలు ఉన్నా వారిపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు దాడులు నిర్వహించవని వసంత విమర్శించారు. లిక్కర్ స్కామ్ విషయంలో ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీ ముందు హాజరై అన్ని వివరాలు తెలియజేసిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. ఫోన్లు ధ్వంసం చేశారన్న పుకార్లు పుట్టించి బద్‌నాం చేశారని, అయినా కవిత సెల్‌ఫోన్లు దర్యాప్తు సంస్థలు అప్పగించి తన నిజాయితీని ప్రదర్శించారన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన ప్రాథమిక హక్కులకు అనుగుణంగా విచారణ నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారని, కోర్టులో ఆ అంశం ఉండగానే బిజెపి ప్రభుత్వం ఈ సారి ఈడీకి బదులుగా సి.బి.ఐని ఉసిగొల్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్వేచ్ఛను కోరేవారు, లౌకిక వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కోరేవారందరు బిజెపికి శత్రువులే అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రయోజనం పొందాలన్న తప్పుడు ఉద్దేశంతో కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఇబ్బందులు పెట్టాలన్న బిజెపి ఆలోచనలు తెలంగాణలో నడువవు అన్నారు. తెలంగాణ ఉద్యమ కాక్ నుండి ఇలాంటి బెదిరింపులు వేలకొద్ది ఎదుర్కొన్నామని, ఇప్పుడు సైతం బిజెపి ప్రభుత్వ బెదిరింపులకు, హూంకరింపులకు భయపడం అన్నారు. తలవచ్చే ప్రసక్తి లేదని, బిజెపి ఆరోపణలకు తెలంగాణ ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతామన్నారు. వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని, రాజకీయ లబ్దిపొందాలనే ఆలోచనను ఇప్పటికైనా బిజెపి విడనాడాలన్నారు.

## నూతన జిల్లా సంక్షేమ అధికారిని సన్మానించిన టిఎన్జీవోలు

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



జిల్లా నూతన జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి.వాణిశ్రీ ని జగిత్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బి.వాణిశ్రీ మాట్లాడుతూ ఉద్యోగులందరం సమన్వయంతో పనిచేసి సంక్షేమ శాఖను ముందు వరుస లో ఉంచేలా కృషి చేద్దామని వారు తెలిపారు. తదుపరి టీఎన్జీవో అధ్యక్షులు భోగ శశిధర్ సమక్షం లో సంక్షేమ శాఖ టీఎన్జీవో ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి సభ్యత్వ నమోదు చేయటం జరిగినది. ఈ సందర్భంగా భోగ శశిధర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎప్పుడు టీఎన్జీవో సంఘము అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోలు మధుకర్, అయూబ్, మమత, రాజశ్రీ, శైలజ, పవిత్ర, సుధారాణి, జానకి, కవిత, సువర్ణ, భాగ్యలక్ష్మి, జ్యోతి, ఉమా మహేశ్వరి, సుభద్ర, పద్మావతి, లావణ్య,రాధ, అరుణ, లత, రాధిక, ప్రేమలత, శోభారాణి, హేమలత, నీలిమ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కి సన్మానం

మెట్ పల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



మెట్ పల్లి కమిషనర్ గా ఇటీవల నియామకం అయిన తొగిటి మోహన్ ను ప్రముఖ న్యాయవాది, తెలంగాణ జన సమితి నాయకులు పసునూరి శ్రీనివాస్ సన్మానించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ని కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛము అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సజ్జనపు కృష్ణనంద్, బొడ్డు సుధాకర్, చాట్ల గణేష్, గంటా ప్రవీణ్ రావు, రాపెల్లి సత్యం, పాలేపు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

జగిత్యాల పట్టణములోని 25 వ వార్డు లో రెండు లక్ష్మి నరసింహస్వామి ఆలయాలలో లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. అనంతరం ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ ద్వారా ఒక్కో ఆలయానికి 1 లక్ష రూపాయలు కేటాయించగా ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. వెంట 25 వార్డు బి ఆర్ ఎస్ నాయకులు, భక్తులు, ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయ డబ్బులు వాడుకున్న ఆలయ ఉద్యోగి

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

37.80 లక్షలు సొంతానికి వాడుకొన్న ఉద్యోగి ఉదంతం కొండగట్టు అంజన్న ఆలయంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గతంలో కూడా ఆలయ సిబ్బంది దేవాలయ ఆదాయాన్ని అక్రమంగా స్వంతానికి వాడుకోవడం, లెక్కల్లో తేడాలు చేయడం, లెక్కల్లో ఎక్కించకుండా పక్క దారి పట్టించిన ఘటనలు అనేకం జరిగాయి. పలువురు ఉద్యోగులు హుండి లెక్కింపుల్లో నగలు కాజేస్తూ దొరికిన ఘటనలు మరవక ముందే తాజాగా శ్రీనివాస్ చారి అనే సినియర్ అసిస్టెంట్ ఆలయ టెండరు సొమ్ము ? 37 లక్షల 80 వేలు సొంతానికి వాడుకున్నట్లు అధికారులు గుర్తిం చారు. ఒక సాధారణ గుమస్తా, ఇంత పెద్ద మొత్తం దుర్వినియోగం చేస్తుంటే, ఉన్నతాధికారులు, ఈవో ఎం చేస్తున్నారనే ప్రశ్నకు అధికారులే జవాబు చెప్పాలి. ఇందులో రాజకీయ నాయకుల పాత్రపై కూడా అనుమానాలున్నాయి. సదరు ఉద్యోగికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తున్నా, గత అనుభవాల బట్టి, అక్రమార్కులపై ఎలాంటి చర్యలు ఉండకపోవచ్చని భక్తులు భావిస్తున్నారు.



## మెడికల్ కాలేజీ వసతి గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



మెడికల్ కాలేజీ, వసతి గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం రోజున జగిత్యాల పట్టణంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణం, బాలుర, బాలికల వసతి గృహాల భవనముల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంభందిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అవసరమైన ముడిసరుకు తెప్పించాలని, సమయానికి నిర్మాణ పనులు పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఆర్డీఓ శ్రీనివాస రావు, మునిసిపల్ కమీషనర్ అనీల్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 317 సమీక్ష కొరకు క్యాబినెట్ సబ్ కమిటీని ఆహ్వానిస్తున్నాం

### తెలంగాణ ఉద్యోగుల జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు

కరీంనగర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 మేరకు జీవో నెంబర్ 317 ద్వారా నూతన జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపు విషయంగా అనేక సమస్యలు ఏర్పడినందున అట్టి సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ నూతన ప్రజా సర్కార్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే ప్రభుత్వం అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టం జరిగిన ఉద్యోగుల నుండి కూడా అప్పీల్స్ స్వీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఇదే కమిటీకి జోనల్ వ్యవస్థ పై రివ్యూ జరిపేందుకు అధికారం కల్పించాలని కోరారు ఉమ్మడి 10 జిల్లాల ప్రాతిపదికను జోనలను రూపొందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి జాతర, అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.

prajamantalau daily pages (25-02-24)R_times of varha main (13-2).qxd 2/25/2024 5:00 AM Page 5



# అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చాలి

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



సామాజిక బాధ్యతతో అర్హులైన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో క్యాంపస్ అంబాసిడర్ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కళాశాల, విద్య సంస్థలలో చదువుతున్న 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి పేరును ఓటరుగా నమోదు చేయించాలని, మంచి వ్యక్తికి ఓటు వేసే విధంగా కృషి చేయాలని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంబాసిడర్లు కృషి వలన 0.86 శాతం నుండి 3.85 శాతం వరకు యువత పేర్లు నమోదు చేయడం జరిగిందని, ప్రస్తుతం 2.85 శాతం ఉందని, 4 శాతం వరకు నమోదకు తీసుకురావాలని అన్నారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా మంచి వ్యక్తికి ఓటు వేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చరిత్ర, ప్రజాస్వామ్యం లపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజా స్వామ్యం పరిపుష్టి చేయాల్సిన బాధ్యత యువత పై ఉందన్నారు. అర్హులైన వారి పేర్లను నమోదు చేయాలని అన్నారు. ఇంఛార్జి జగిత్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఎన్నికలు సజావుగా నడిచే విధంగా, ఎటికల్ ఓటింగ్ జరిగే విధంగా పాటుపడాలని అన్నారు. అంతకుముందు స్వీప్ నోడల్ అధికారి కె.లక్ష్మి నారాయణ జిల్లాలోని 28 డిగ్రీ, 75 జూనియర్ కళాశాలలు, 6 ప్రొఫెషనల్ కళాశాలల్లో అంబాసిడర్ లను నియమించడం జరిగిందని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మెంటర్లు, కళాశాలల అంబాసిడర్లు , తదితరులు పాల్గొన్నారు.

# పీ.ఆర్.సి. మిషన్‌కు నివేదించాం

### తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



వేతన సవరణ కమిషనర్ శివశంకర్ ను తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లో కలిసి వేతన సవరణ లో ఆమోదించవలసిన అంశాలపై నివేదికను సమర్పించినట్లు ఆ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తెలిపారు. నివేదిక లోని అంశాలను పెన్షనర్ల సమాచారం కోసం వివరించారు.ఫిట్మెంట్ 40 శాతం తగ్గకుండా ఇవ్వాలని,పెండింగులో ఉన్న 3 డి.ఏ. లను విడుదల చేయాలని,గ్రాట్యుటీ 16 లక్షల నుండి 20 లక్షలకు పెంచాలని,అడిషనల్ ఖ్వాంటము పెన్షన్ 65 ఏళ్ల వారికి 15 శాతం ఆదనముగా చెల్లించాలని, ఇట్టి పెన్షన్ 65 ఏళ్ళు నిండిన మొదటి తేదీనే చెల్లించాలని,అంత్యక్రియలకు రూ.50 వేలు మంజూరు చేయాలని,ఈ కుబేర్ పథకం రద్దు చేయాలని, ఆరోగ్య కార్డులు వేములవాడ, భద్రాచలం, యాదాద్రి దేవాదాయ పెన్షనర్లకు, గ్రంథాలయ, వాటర్ వర్క్స్, మార్కెట్ కమిటీల, సహకార సంస్థలు, సింగరేణి కాలరీస్ పెన్షనర్లకు ప్రభుత్వ పెన్షనర్స్ మాదిరిగా ఇవ్వాలని,1 శాతం కంట్రిబ్యూషన్ తో పరిమితి లేకుండా అన్ని కార్పోరేట్,ప్రభుత్వ నిమ్స్ తదితర ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని,వైద్య అలెవెన్సులు రూ.2000 ప్రతి నెలా చెల్లింపునకు ,తదితర ప్రయోజన డిమాండ్స్ తో కూడిన నివేదిక వేతన సవరణ కమిషనర్ కు అందించినట్లు హరి ఆశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నవనీత రావు,కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణం స్పందించాలి

### విద్యుత్ శాఖ ఎస్ఈ రవికుమార్


సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



ప్రజల నుండి వచ్చే విద్యుత్ సమస్యలు, ఫోన్ కాల్స్ ఫిర్యాదులపై సిబ్బంది ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సికింద్రాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవికుమార్ అన్నారు. బోయిగూడ లోని ప్యారడైజ్ డివిజన్ కార్యాలయంలో శనివారం జరిగిన విద్యుత్ అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా డిప్యూటి సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ సీఎండి ముషారఫ్ అలీల ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అలక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. లోవోల్టేజీ సమస్యలు రాకుండా అదనపు ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, కొత్త లైన్లను వేయడానికి ప్రణాళికను రూపొందించాలని కోరారు. ప్యారడైజ్ డివిజన్ పరిధిలో 5.20 లక్షల మంది వినియోగదారులు ఉన్నారని, వారికి నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు గాను 32 సబ్ స్టేషన్లు, 7860 ట్రాన్స్ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్యారడైజ్ డివిజన్ ఇంజనీర్ శ్రీధర్ ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడిఈలు శివ దుర్గాప్రసాద్, మహేశ్ కుమార్, చంద్రశేఖర్, విజయ కుమార్, సురేశ్, తొమ్మిది సెక్షన్ల లైన్ మెన్లు పాల్గొన్నారు.

## నేడు జగిత్యాలలో విద్యుత్ అంతరాయం

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):




తేదీ: 25.02.2023 ఆదివారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 11:30 గంటల వరకు 33/11 కె వి జగిత్యాల టౌన్ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ దృష్ట్యా జగిత్యాల పట్టణంలో గల జగిత్యాల టౌన్ 1 సెక్షన్ పరధిలో రాంబజార్, పురాణిపేట, కరీంనగర్ రోడ్డు, గణేష్ టెంపుల్ ఏరియా, బైపాస్ రోడ్డు, అంగడి బజార్, యావర్ రోడ్డు, మార్కెట్ బ్యాక్ సైడ్, కృష్ణ నగర్, ఆరవిందనగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాక సంధి , సాయిరాం నగర్, గోవింద్ పల్లి, శ్రీరాం నగర్, వెంకటాద్రి నగర్, లలో సప్లై నిలిపి వేయబడును వినియోగదారులు సహకరించగలరని. కే. అశోక్ రెడ్డి ఏఏఈ ఆపరేషన్ టౌన్ 1 జగిత్యాల ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ పాద ట్రస్ట్ చైర్మన్ 'శ్రీను బాబు' జన్మదిన వేడుకలు

మహాదేవపూర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

మహాదేవపూర్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కట్కం అశోక్ ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీ పాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు అనంతరం ప్రభుత్వ సామాజిక హాస్పిటల్ లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు ఎంపీపీ బి రాణి బాయి, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్ రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కడార్ల నాగరాజు , సుంకరి సమ్మయ్య, సీనియర్ నాయకులు వామన్ రావు, రామ్మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ చెక్కర ఫ్యాక్టరీ సందర్శించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



మెట్ పల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

ముత్యంపేట నిజం షుగర్ ఫ్యాక్టరీ ని సందర్శించాలని కోరిన మెట్ పల్లి కాంగ్రెస్ నాయకులు బోధన్ లో కాంగ్రెస్ పార్టీ హామీ మెరకు తెలంగాణలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ లను తెరిపిస్తాం అని మాట ఇచ్చిన కారణంగా బోధన్ చెక్కర ఫ్యాక్టరీ సందర్శించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి వారికి ఘన స్వాగతం పలికిన మెట్ పల్లి కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు కి మరియు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు ఆదేశాల మేరకు ఘన సన్మానం చేయడం జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ%"%. షుగర్ ఫ్యాక్టరీ లను త్వరలో ప్రారంభిస్తామని దీనికి ఒక కమిటీ వేయడం జరిగింది. రైతులకు మంచి రోజులు వస్థాయి అని తెలిపారు. త్వరలో ముత్యం పేట నిజం షుగర్ ఫ్యాక్టరీ ని సందర్శించాలని కోరిన మెట్ పల్లి కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఫిషేర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కూన గోవర్ధన్, కల్లెడ గంగాధర్, యండి జఫర్, వెంకట గిరి, మామిడి రాజశేఖర్ రెడ్డి,ఆనంద్ రెడ్డి,లోక ప్రతాప్ రెడ్డి, నాగరాజు, ఎంఎస్ యుఐ జిల్లా సెక్రటరీ చీమల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ వైసీపీనే ప్రజలు గెలిపిస్తారు

### మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆశాభావం

**అమరావతి,ఫిబ్రవరి24:** వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి తమకు ఓటు వేయాలన్నారు మంత్రి గుడివాడ అమర్నాథ్. ఈ సందర్భంగా టీడీపీ–జనసేన పొత్తులపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. టీడీపీ, జనసేన తమ పొత్తు చూసి ఓటు వేయాలని చెబుతున్నారని విమర్శించారు. కాగా.. రాష్ట్రంలో ప్రజలు వైసీపీని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## మృతుని కుటుంబానికి చేయూత అందించిన తంగేళ్లపల్లి రమేష్

ఎల్కతుర్తి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండలం లోని కోతుల నడుమ గ్రామంలో ఇటీవల మరణించిన ఎర్రోళ్ల మొండయ్య కుటుంబ సభ్యులను పమర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ అందజేయడమైనది. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా మండలంలో ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రత్నాకర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఎర్రోళ్ల చైతన్య కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక రమేష్, అంబాల స్వామి శ్రావణ్ రెడ్డి మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్ల రాజు, పల్లె వేణి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు

మహాదేవపూర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని రాష్ట్ర హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి కి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు అర్చకులు శేష వస్త్రములతో వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జిలు కోర్టు సిబ్బంది, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మహాదేవపూర్ సి.ఐ. రాజేశ్వరరావు, కాళేశ్వరం ఎస్సై, భవాని సేన పాల్గొన్నారు.

## కాలేరు చినబాబు ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తా : కత్తి సంపత్



వేలేరు ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

వేలేరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి సంపత్ మాట్లాడుతూ.... ఎర్రబెల్లి గ్రామంలో సమ్మక్క సారక్క గద్దెలను దర్శించుకుంటారని వీలువడక రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రాలేదని దేవస్థానం దగ్గర కట్టిన ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులతో కలిసి చింపేసిన కాలేర్ చిన్న బాబుపై వేలేర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని వారిపై కేసు నమోదు అయిందని స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలేరు చిన్నబాబు కి షోకాస్ నోటీసులు ఇచ్చామని రెండు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వరుణ్, భీమదేవరపల్లి మండలం కాంగ్రెస్ నాయకులు రాజు రవీందర్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్/రామంతాపూర్‌లలో

## 1వ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు ప్రవేశము కొరకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):

2024 - 25 వ, విద్యా సంవత్సరమునకు గాను అర్హత గల షెడ్యూల్డ్ కులముల బాల బాలికల నుండి హైదరాబాద్ లోని పబ్లిక్ స్కూల్స్ బేగంపేట్ నందు (1) సీటు మరియు రామంతాపూర్ నందు (1) సీటు కొరకు 1వ, తరగతి కోరబడుచున్నవి. ఇంగ్లీష్ మీడియం నందు ప్రవేశం కొరకు ధరఖాస్తులు విద్యార్థి వయస్సు తేది: 01-06-2017 నుండి 31-05-2018 మధ్యన జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయము గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000/- పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- లకు మించరాదు. పుట్టిన తేది ధృవీకరణ పత్రం సంబందిత తహశీల్దారు/ మున్సిపాలిటీ నుండి పొందవలయును. ఆదాయం మరియు కులము ధృవీకరణ పత్రములు మీ-సేవ ద్వారా పొందవలయును. రేషన్ కార్డు మరియు ఆధార్ కార్డుల జిరాక్సు ప్రతులను జతపరచవలయును. జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారిచే ధృవీకరించి జత పరచవలయును. దరఖాస్తు ఫారములు జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి కార్యాలయము, జగిత్యాల గారి నుండి తేది: 24-02-2024 నుండి తేది: 12-03-2024 వరకు కార్యాలయ పని దినములలో పొంది (2) రెండు పాసు పోర్ట్ సైజు ఫోటోలతో జిరాక్స్ ప్రతులు మరియు ఒరిజినల్ సర్టిఫికేట్ల తో (2) జతల దరఖాస్తు అదే రోజు సాయంత్రం 5-00 గంటలవరకు ఫారములు సమర్పించవలయును. తేది: 15-03-2024 రోజున ఉదయం 11.30 గంటలకు లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయబడును. గడువు తర్వాత వచ్చిన, అసంపూర్తి గా ఉన్న దరఖాస్తు ఫారములు మరియు సంబంధిత సర్టిఫికేట్స్ (జిరాక్స్) కాపీలు జత చేయని యెడల అట్టి దరఖాస్తులు తిరస్కరించబడును.

prajamantalau daily pages (25-02-24)R_times of varha main (13-2).qxd 2/25/2024 5:00 AM Page 6



## భద్రకాళి అమ్మవారి సేవలో బౌద్ధనగర్ కార్పొరేటర్



సికింద్రాబాద్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ కుటుంబ సభ్యులతో కలసి శనివారం వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భ ంగా అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కలను తీర్చుకున్నారు. భద్రకాళి అమ్మవారికి బోనం, ఓడి బియ్యాన్ని సమర్పించినట్లు కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. పూజల్లో బీఆర్ఎస్ నాయకులు కంది నారాయణ, శ్రీకాంత్, పాల్గొన్నారు.

## పద్మారావునగర్‌లో విజయ సంకల్పయాత్ర ఏర్పాట్లు

సికింద్రాబాద్ ఫిబ్రవరి 24 ( ప్రజామంటలు):



ప్రధాని మోదీ చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఈనెల 26న బన్సీలాల్ పేట డివిజన్ పద్మారావునగర్ నుంచి ప్రారంభిస్తున్నట్లు సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాంసుందర్ అన్నారు. శనివారం స్థానిక బీజేపీ నాయకులతో కలసి ఆయన విజయ సంకల్ప యాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక స్వరాజ్ ప్రెస్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...యాత్రలో ప్రతి బీజేపీ కార్యకర్త, నాయకుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు టి.రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, పెద్ది రవీందర్, హరినాథ్ నాయీ, సారంగపాణి,ఉమేశ్, అమర్ నాథ్, రాజు, కృష్ణ, స్పందన పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళా బృందంచే అవగాహన

జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):



జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపుర్ గ్రామం లో పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం భాగంగా ఏఎస్పై మాట్లాడుతూ.... పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలో చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగ చేయదానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు త0త్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పై మరియు గ్రామ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్, పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## సరిపోదా శనివారం..నాని ఫస్ట్ లుక్




నానిహీరోగా నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకుడు. డి.వి.వి. ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డి.వి.వి. దానయ్య నిర్మిస్తున్నారు. శనివారం నాని పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ సమవర్తి.. సమవర్తి అంటూ ఇందులో నాని సూర్య అనే పాత్రలో నటిస్తున్నాడు. 'కోపాలు రకరకాలు. ఒక్కో మనిషిలో ఒక్కోలా ఉంటుంది. కానీ ఆ కోపాన్ని క్రమబద్ధంగా, ఓ పద్ధతిగా వారంలో ఒక్కరోజు మాత్రమే చూపించే పిచ్చి నా కొడుకుని చూశారా? నేను చూశా... పేరు సూర్య... రోజు శనివారం' అంటే హీరో పాత్రను ప్రతినాయక పాత్ర పోషిస్తున్న ఎస్.జె.సూర్య పరిచయం చేశారు. గ్లింప్స్‌లో హీరో ఇంట్రడక్షన్ ఇచ్చిన తీరు బావుంది. నాని మాస్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ప్రియాంక ఆరుళ్ మోహన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజాయ్ సంగీతం అందిస్తున్నారు. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

# టిల్లుస్క్వేర్‌లో అనుపమ అందాల ఆరబోత

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తోన్న చిత్రం 'టిల్లు స్క్వేర్' మల్లిక్‌రామ్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ రికార్డ్ ప్రైస్‌కు అమ్ముడయినట్లుగా తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను రూ. 35 కోట్లకు సొంతం చేసుకున్నట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే మాత్రం ఈ మధ్యకాలంలో ఏ యంగ్ హీరోకి లేని రికార్డ్‌ను సిద్ధు జొన్నలగడ్డ క్రియేట్ చేసినట్లే. ఎలా అంటే, ఈ మధ్య కాలంలో ఏ కుర్ర హీరో చిత్రానికీ ఈ రేంజ్‌లో హక్కులు అమ్ముడవలేదు. 'డీజే టిల్లు' సక్సెస్ తర్వాత వస్తున్న ఈ సీక్వెల్‌పై మంచి అంచనాలు అయితే ఉన్నాయి కానీ.. ఈ రేంజ్‌లో ఓటీటీ హక్కులు అమ్ముడవుతాయని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. అందుకు కారణం మాత్రం అనుపమ అందాలే అని చెప్పుకోవాలి. ఇప్పటి వరకు పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమ.. ఈ సినిమా విషయంలో మాత్రం ఓ రేంజ్‌లో రెచ్చిపోయి కనిపిస్తోంది. ప్రేమికుల రోజున విడుదలైన ట్రైలర్‌లో ఆ విషయం స్పష్టంగా తెలిసిపోయింది. ట్రైలర్ తర్వాత ఈ సినిమా స్వరూపమే మారిపోయింది. అది ఇలా హక్కుల రూపంలో కనిపిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ కూడా తనదైన నటనతో మరోసారి సినిమాపై అంచనాలను పెంచేశారు. ట్రైలర్‌లో ఆయన చెప్పే ఒక్కో డైలాగ్.. కిర్రాక్ అన్నట్లుగా ఉంది. మొత్తంగా అయితే.. ఓటీటీ రైట్స్‌తో 'టిల్లు స్క్వేర్' మరోసారి వార్తలలో వైరల్ అవుతోంది. మార్చి 29న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మరి ట్రైలర్‌తో ఇంత హీట్ పుట్టించిన అనుపమ.. సినిమాలో ఇంకేం చేసి ఉంటుందో తెలియాలంటే మాత్రం.. మార్చి 29 వరకు వెయిట్ చేయక తప్పదు.





# ఆపరేషన్ వాలంటైన్ విజయం కోసం వరుణ్ ఎదురుచూపు




విజయం కోసం పరితపిస్తున్న యువనటుల్లో మెగా కుటుంబం నుండి వచ్చిన వరుణ్ తేజ్ ఒకరు. వరుణ్ కి ఒక మంచి బ్రేక్ వచ్చి చాలా సంవత్సరాలు అయింది. ఐదేళ్ల క్రితం చేసిన 'గద్దలకొండ గణేష్' అనే సినిమా పరవాలేదు బాగానే ఆడింది అని అన్నారు, అంతే ఆ తరువాత వరుణ్ కొన్ని సినిమాలు చేసినా విజయం మాత్రం వరించలేదు. ఆ సినిమా తరువాత పాండెమిక్ రావటం, కొంచెం విరామం తీసుకోవటం జరిగింది. 'గద్దలకొండ గణేష్' చేసిన మూడేళ్ళ తరువాత 'ఘని' అని బాక్సింగ్ నేపథ్యంలో వచ్చిన సినిమా చేశారు, కానీ అది తీవ్ర నిరాశే మిగిల్చింది. విడుదలైన రెండో రోజుకే ఆ సినిమాని కొన్ని థియేటర్స్ నుండి తీసేసారు. ఆ తరువాత వరుణ్ ఎక్కువ సినిమాలు ఒప్పుకోలేదు అనే చెప్పాలి. ఆ తరువాత వచ్చిన 'ఈ3: ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ముందు వచ్చిన 'ఎఫ్ 2' కి సీక్వెల్ గా వచ్చింది. ఇందులో వెంకటేష్ ఇంకో కథానాయకుడిగా వేశారు, కానీ ఈ సినిమా మొదటి సినిమా అంత విజయం సాధించలేదనే చెప్పాలి. గత సవంత్సరం 'గాండీవధారి అర్జున' అనే గూఢచారి, యాక్షన్ నేపథ్యం వున్న సినిమా చేశారు. ప్రవీణ్ సత్తారు దీనికి దర్శకుడు. అయినా ఈ సినిమా కూడా డిజాస్టర్ గా నిలిచింది. గత సంవత్సరం తన సహచరి నటి లావణ్య త్రిపాఠి ని వివాహం చేసుకున్నారు. ఇప్పుడు 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇది తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఇది ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో కొన్ని నిజ సంఘటనల ఆధారంగా మలిచిన చిత్రం అని చెపుతున్నారు. దీనికి హిందీ దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ హడ దర్శకత్వం వహించారు. అయితే ఇది మరి తెలుగు ప్రేక్షకులకు ఆసక్తికరంగా ఉంటుందా అని ఒక చిన్న సందేహం అని పరిశ్రమలో టాక్. అలాగే ఈ సినిమా వార్ నేపథ్యం కూడా ఉంటుంది అని చెపుతున్నారు.ఇలాంటి నేపథ్యం వుండే సినిమాలు తీసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి, ఇంతకు ముందు వరుణ్ తేజ్ 'అంతరిక్షం' అనే సినిమా ఒకటి చేశారు. కానీ ఇది ప్రేక్షకులకి అంతగా ఎక్కలేదు. మరి ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా తెలుగు ప్రేక్షకులకి ఆసక్తికరంగా ఉంటుందా? ఎందుకంటే ఈ సినిమా టైటిల్ ఇంగ్లీష్ లో వుంది, మరి ఇలాంటి టైటిల్ పెడితే మాస్ ప్రేక్షకులు థియేటర్స్ కి వస్తారా అని ఒక సందేహం కూడా వుంది అని చర్చ. అదీ కాకుండా ఈమధ్య పాన్ ఇండియా కథలంటూ తెలుగు నటులు చాలామంది ప్రయత్నాలు చేశారు, కానీ ఎవరూ సఫలం కాలేదు. మరి వరుణ్ సినిమా ఎంతవరకు విజయం సాధిస్తుందో చూడాలి. ఈ సినిమా మార్చి 1 న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకి ప్రచారాలు కూడా బాగానే చేస్తున్న వరుణ్ తేజ్ కి ఇప్పుడు ఒక మంచి విజయం కావాలి, అందుకోసం ఎదురుచూస్తున్నారు, ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అతనికి ఆ బ్రేక్ ఇస్తుందని ఆశిద్దాం!

# బికినీలో అదరగొట్టిన సమంత






టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తరుచూ తన రొటీన్ లైఫ్ ఫొటోలను అభిమానులతో పంచుకునే సమంత తాజాగా విడుదల చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద రచ్చనే లేపుతున్నాయి. ప్రస్తుతం మలేసియాలో ఓ గ్రాండ్ రిసార్ట్‌లో వేకేషన్ ఎంజాయ్ చేస్తున్న సమంత అక్కడ ఓ చిన్న పాండ్‌లో బికీనిలో స్విమ్ చేస్తూ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా క్షణాల్లోనే తెగ వైరల్‌గా మారాయి. దీంతో చాలామంది హాలీడేస్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్స్ పెడుతుండగా మరికొందరు సమంత ఏంటి విడాకుల తర్వాత రోజురోజుకు గ్లామర్ డోస్ పెంచుతుందంటూ నోరెళ్ల బెడుతున్నారు. ఇదిలాఉండగా అనారోగ్య సమస్యలతో ట్రీట్మెంట్ తీసుకున్న సమంత ప్రస్తుతం బయటి దేశాల్లో ఎక్కువగా గడుపుతూ విశ్రాంతి తీసుకుంటుంది. ఇక ఆమె తాజాగా నటించిన బాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్ త్వరలో విడుదల కానుంది.

## ముగ్గురు భామల క్రూ

బాలీవుడ్ భామలు టబు, కరీనా కపూర్ ఖాన్, నేషనల్ అవార్డు విన్నర్ కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రూ'. లూట్‌కేస్' ఫేమ్ రాజేష్ కృష్ణన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను ఏక్తాకపూర్, రియాకపూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ముగ్గురు ఎయిర్ హోస్టెస్ గెటప్‌లో కనిపిస్తున్నారు. టబుతో ప్రమాదం అని, కరీనాను దొంగ అని, కృతి సనన్‌ను నకిలీ అని పోస్టర్స్‌కు క్యాప్షన్ ఇవ్వడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇక ఈ చిత్రంలో పంజాబీ యాక్టర్ దిల్జీజ్ దోసాంజ్, కపిల్ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



prajamantalau daily pages (25-02-24)R_times of varha main (13-2).qxd 2/25/2024 5:00 AM Page 7



## లైవ్ మ్యాచ్‌లో బై బై రోహిత్ అంటూ ట్రోలింగ్

### ఇంగ్లీష్ అభిమానులపై ఫైరవుతోన్న నెటిజన్స్



రాంచీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ తీవ్రంగా నిరాశపరిచాడు. చివరి టెస్టులో సెంచరీ సాధించిన భారత కెప్టెన్.. రాంచీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం రెండు పరుగులు మాత్రమే చేసి, జేమ్స్ అండర్సన్ బంతికి బెన్ ఫోక్స్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. భారత కెప్టెన్ ఔటైన తర్వాత ఇంగ్లిష్ అభిమానులు చేసిన చర్యలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇంగ్లండ్ బార్మీ ఆర్మీ కూడా ఇంగ్లీష్ అభిమానుల వీడియోను షేర్ చేసింది. రెండో రోజు తొలి సెషన్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 353 పరుగులకు తీసుకెళ్లింది. అనంతరం తొలి సెషన్‌లో భారత్ బ్యాటింగ్ ప్రారంభించింది. భారత ఇన్నింగ్స్‌ను యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ ప్రారంభించారు. అయితే, అండర్సన్ మూడో ఓవర్‌లోనే నాలుగు పరుగుల వద్ద భారత్‌కు మొదటి షాక్ ఇచ్చాడు.రోహిత్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. రోహిత్ ఔట్ అయ్యి పెవిలియన్‌కు చేరుకుంటుండగా.. ఇంగ్లిష్ అభిమానులు రోహిత్‌ను భారత అభిమానుల ముందు ట్రోల్ చేశారు. ఇంగ్లిష్ అభిమానులు భారత కెప్టెన్‌కి బై చెప్పడం ప్రారంభించారు. చేతులు ఊపుతూ ఇంగ్లిష్ అభిమానులు బై బై రోహిత్ అంటూ పాడడం ప్రారంభించారు.రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ స్టేడియంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ జరుగుతోంది. మ్యాచ్ రెండో రోజు తొలి సెషన్ లో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్ లో 353 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం రెండో రోజు మూడో సెషన్ ఆట కొనసాగుతోంది. దీంతో టీమిండియా ఏడు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. ధృవ్ జురెల్, కుల్దీప్ యాదవ్ క్రీజులో ఉన్నారు. 56వ ఓవర్లో భారత్ ఏడో వికెట్ పడింది. ఆర్ అశ్విన్ కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. అతన్ని టామ్ హార్ట్లీ అవుట్ చేశాడు. ఇప్పటి వరకు ఇంగ్లండ్ తరపున షోయబ్ బషీర్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. టామ్ హార్ట్లీ రెండు వికెట్లు సాధించాడు. జేమ్స్ అండర్సన్‌కు ఒక వికెట్ దక్కింది.జో రూట్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (122లి) చేసిన తర్వాత ఇంగ్లండ్‌లో నాటౌట్‌గా నిలిచాడు. భారత్ తరపున రవీంద్ర జడేజా అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం టీమిండియా 2-1తో ఆధిక్యంలో ఉంది.

## సీఎస్కే జట్టుకు వరుస షాక్‌లు..



ఐపీఎల్-2024 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ జట్టను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే స్టార్ ఆల్ రౌండర్లు శివమ్ దుబే, డార్లీ మిచెల్ గాయాలతో ఇబ్బంది పడుతుండగా.. తాజాగా మరో న్యూజిలాండ్ స్టార్లు డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర గాయపడ్డారు. ఆస్ట్రేలియాతో తొలి టీ20 సందర్భంగా రచిన్ రవీంద్ర ఎడమ కాలికి గాయం కావడంతో అతడు రెండో టీ20కు దూరం అయ్యాడు.అయితే, రెండో టీ20లో న్యూజిలాండ్ బ్యాటర్ డెవాన్ కాన్వే సైతం గాయపడ్డాడు. కీపింగ్ చేస్తుండగా బంతిని అందుకునే క్రమంలో ఎడమ చేతి బొటనవేలికి గాయం అయింది. దీంతో అతడు ఆట మధ్యలోనే మైదానాన్ని వదిలి వెళ్లాడు. ఇక, స్కానింగ్‌కు తరలించగా ఫ్రాక్చర్ ఉన్నట్లు వెల్లడైంది. దీంతో అతడు మూడో టీ20కు దూరం అయ్యాడు. కాన్వే స్థానంలో టిమ్ సీఫర్ట్ జట్టులోకి వచ్చాడు.ఇక, ఐపీఎల్ ఆరంభ సమయానికి డెవాన్ కాన్వే పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉందని తెలుస్తోంది. అతడితో పాటు డార్లీ మిచెల్, రవీంద్ర కూడా పూర్తిగా కోలుకోనున్నట్లు పలు రిపోర్ట్‌లో పేర్కొన్నాయి. కాగా, ఈ ఏడాది ధానాదన్ లీగ్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో చెపాక్ వేదికగాచెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి.

# ముగిసిన రెండో రోజు ఆట

### 134 పరుగులు వెనుకంజలో భారత్



రాంచీలో జరుగుతున్న భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. కాగా.. మొదట బ్యాంటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ లో 353 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఈరోజు మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన టీమిండియా.. ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. అయితే.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 134 పరుగులు వెనుకంజలో ఉంది. ఆట ముగిసే సమయానికి వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ ధ్రువ్ జురెల్ (30), కుల్దీప్ యాదవ్ (17) పరుగులతో క్రీజులో ఉన్నారు.కాగా.. టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 73 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (2) ఆదిలోనే ఔట్ అయి షాక్ ఇచ్చాడు. గిల్, జైస్వాల్ కాసేపు నిలకడగా రాణించారు. కానీ గిల్ కూడా 38 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన భారత్ బ్యాటింగ్ లో రజత్ పాటిధర్ (17), జడేజా (12), సర్ఫరాజ్ ఖాన్ (14) పరుగులు చేశారు. దీంతో ఓ దశంలో టీమిండియా కష్టాల్లో పడింది. 171 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన భారత్.. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్ వికెట్ పడకుండా ఆచితూచి ఆడారు. కాగా.. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ స్పిన్నర్లు పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుని టీమిండియాను దెబ్బతీశారు. ఇంగ్లండ్ బౌలింగ్ లో షోయబ్ బషీర్ 4, టామ్ హార్ట్ లే 2 వికెట్లు పడగొట్టారు. జేమ్స్ ఆండర్సన్ ఒక వికెట్ తీశాడు.

# ముంబయి ఇండియన్స్ సూపర్ విక్టరీ



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో స్టార్ట్ అయింది.

ఆరంభ మ్యాచ్ లో డిపెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, గత సీజన్ రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు పోటీ పడ్డాయి. ఇరు జట్ల మధ్య ఉత్కంఠ పోరు కొనసాగింది. ఇక, ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్య చేధనలో ముంబయి ఇండియన్స్ సూపర్ విక్టరీ సాధించింది. ముంబై జట్టుకు చివరి బంతికి 5 రన్స్ కావాల్సిన సమయంలో అప్పుడే క్రీజులోకి వచ్చిన సజనా సిక్స్ కొట్టి గెలుపును అందించింది. దీంతో చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్ లో ఢిల్లీపై ముంబై నాలుగు వికెట్ల తేడాతో విక్టరీ సాధించింది. ఇక, చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ టీమ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టానికి 171 రన్స్ చేసింది. 172 పరుగుల లక్ష్య చేధనతో బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ ఉమెన్స్ టీమ్ ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ హెలీ మాథ్యూస్ సున్నా పరుగులకే ఔట్ అయింది. ఆ తర్వాత యాస్తికా భాటియా ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేయగా.. 45 బంతుల్లో 57 పరుగులు చేసి ఔట్ అయింది. నాట్ స్కివర్ బ్రంట్ (19) త్వరగానే అవుటైన.. ఆ తరువాత క్రీజులోకి వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ (55) రెచ్చిపోయింది. చివరకు కౌర్ అవుట్ కావడంతో మ్యాచ్ టెన్సన్ గా మారింది.అయితే, రెండో ఇన్సింగ్ చివరి బంతికి ఐదు పరుగులు చేయాల్సి పరిస్థితి ఏర్పాడింది. దీంతో క్రీజులోకి అప్పుడే సజీవన్ సజన వచ్చారు. అయితే, ఢిల్లీ క్యాపిటల్స్ విజయం దాదాపు ఖాయమని అందరు అనుకుంటున్న టైంలో చివరి బంతికి సంజన సిక్స్ కొట్టి టీమ్ ను విజయతీరాలకు చేర్చారు. దీంతో ముంబై ఇండియన్స్ మహిళల జట్లు నాలుగు వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది.

# రాంచీ టెస్టులో జైస్వాల్ రికార్డుల వర్షం

భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో యశస్వి జైస్వాల్ మరోసారి సత్తా చాటాడు. ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన, అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. తొలి మూడు టెస్టుల్లోనే అతను ఈ ఘనత సాధించాడు. ఇంగ్లండ్‌తో రాంచీ టెస్టు రెండో రోజు యశస్వి మరో అద్భుతం చేశాడు. ఇంగ్లిష్ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ వేసిన బంతిని ఓవర్ లాంగ్ సిక్సర్ కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత బ్యాట్స్‌మెన్‌గా యశస్వి నిలిచాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 23 సిక్సర్లు కొట్టాడు. 2008లో 22 సిక్సర్లు కొట్టిన వీరేంద్ర సెహ్వాగ్ రికార్డును బద్దలు కొట్టాడు. 2022లో 21 సిక్సర్లు బాదిన రిషబ్ పంత్ మూడో స్థానంలో ఉన్నాడు. 23 సిక్సర్లతో, ప్రత్యర్థి జట్టుపై అత్యధిక సిక్సర్లు బాదిన యశస్వి జైస్వాల్ భారత్ తరపున రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాపై 25 సిక్సర్లు కొట్టిన సచిన్ టెండూల్కర్ రికార్డు కంటే అతను కేవలం రెండు అడుగులు వెనుకంజలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాపై 22 సిక్సర్లు బాదిన ప్రస్తుత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డును యశస్వి బద్దలు కొట్టాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్ (21 సిక్సర్లు, ఇంగ్లండ్), రిషబ్ పంత్ (21 సిక్సర్లు, ఇంగ్లండ్) పేర్లు కూడా ఉన్నాయి. ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా ఇప్పుడు యశస్వి రికార్డు సృష్టించాడు. అతను రోహిత్ శర్మ (19), షిమ్రాన్ హెట్మెయర్ (15), బెన్ స్టోక్స్ (15)లను విడిచిపెట్టాడు.ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో 23 సిక్సర్లతో, తమ టెస్ట్ క్రికెట్ కెరీర్‌లో చాలా మంది భారతీయ క్రికెటర్లు కొట్టిన సిక్సర్ల సంఖ్యను యశస్వి వదిలేశాడు. రవిశాస్త్రి, యువరాజ్ సింగ్, రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, క్రిస్ శ్రీకాంత్, గౌతమ్ గంభీర్, శిఖర్ ధావన్ వంటి దిగ్గజాల కంటే ముందున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో యశస్వి ఒక ఇన్నింగ్స్‌లో 12 సిక్సర్లు కొట్టాడు. ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా ఇది ఉమ్మడి ప్రపంచ రికార్డు. పాకిస్థాన్‌కు చెందిన వసీం అక్రమ్ కూడా ఈ పని చేశాడు.



# ఇషాన్ కిషన్-శ్రేయాస్ అయ్యర్‌లకు బీసీసీఐ భారీ షాక్



సీజన్ కోసం బీసిసిఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లకు లోబడి ఉన్న ఆటగాళ్ల జాబితాను మరికొన్ని రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. అయితే, పదేపదే హెచ్చరించినా రంజీ ట్రోఫీ ఆడనందుకు శిక్షగా ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌లను ఈ జాబితా నుంచి మినహాయించాలని నిర్ణయించారు. టీమ్ ఇండియా యువ క్రికెటర్లు ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్ టైమింగ్ సరిగా లేదని చెప్పొచ్చు. ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు దూరమైనప్పటి నుంచి కిషన్ భారత్ తరపున ఆడలేదు. మరోవైపు, ఇంగ్లండ్‌తో జరిగే చివరి మూడు టెస్టు మ్యాచ్‌ల కోసం భారత జట్టు నుంచి అయ్యర్‌ను తొలగించారు. ఇషాన్ కిషన్-శ్రేయాస్ అయ్యర్ దేశవాళీ రెడ్ బాల్ టోర్నమెంట్ ఆడాలని %దీజజ×% ఆదేశించినప్పటికీ, ఇద్దరు బ్యాట్స్‌మెన్ రంజీ ట్రోఫీలో ఆడలేదు. ఇప్పుడు దీనికి ఈ ఇద్దరు భారతీయ స్టార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.నివేదిక ప్రకారం, 2023-24 సీజన్‌కు సంబంధించి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లకు లోబడి ఉన్న ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ మరికొద్ది రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. అయితే, పదేపదే హెచ్చరించినా రంజీ ట్రోఫీ ఆడనందుకు శిక్షగా ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌లను ఈ జాబితా నుంచి మినహాయించాలని నిర్ణయించారు. అంటే, వీరిద్దరికీ బీసీసీఐ నుంచి వార్షిక వేతనంగా రూ.1 లభించదు.”అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్లు 2023-24 సీజన్ కోసం సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాను దాదాపుగా ఖరారు చేశారు. దీనిని బీసీసీఐ త్వరలో ప్రకటిస్తుంది. కిషన్, అయ్యర్‌లు జాబితా నుంచి తప్పుకునే అవకాశం ఉంది. వారు దేశవాళీ క్రికెట్ ఆడటం లేదు. బీసీసీఐ ఆదేశించినా పట్టించుకోలేదని తెలుస్తోంది.ఈ సీజన్ రంజీ ట్రోఫీలో ఇషాన్ కిషన్ జార?ండ్ తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఆంధ్రప్రదేశ్‌తో జరిగే ఏకైక రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై జట్టులో శ్రేయాస్ అయ్యర్ చోటు దక్కించుకున్నాడు. అయితే, అతను బరోడాతో జరిగిన క్వార్టర్ ఫైనల్‌కు అందుబాటులో లేడు.అలాగే, %చీజూ% స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ హెడ్ నితిన్ పటేల్, అయ్యర్ ఆడటానికి ఫిట్‌గా ఉన్నారని, అయితే అతను కనిపించలేదని తెలిపాడు. అతను ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 ప్రకటన షూటింగ్‌కు హాజరయ్యాడు. దీంతో బీసీసీఐ మండిపడినట్లు తెలుస్తోంది. రాజ్‌కోట్‌లో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య మూడో టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ జైషా ఆటగాళ్లకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. రెడ్ బాల్ క్రికెట్ ఆడాలని, విఫలమైతే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నాడు. దీంతో బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAG-TIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com